నవతెలంగాణ
నడుస్తు తెలుగు దినపత్రిక
1
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 23, 2024 | www.navatelangana.com

టెస్ట్‌ట్యూబ్ బేబి సెంటర్ ప్రారంభం

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సంతానంలేని దంపతుల సౌలభ్యం కోసం జిల్లా కేంద్రంలో నూతనంగా సంతాన సాఫల్య కేంద్రం(టెస్ట్‌ట్యూబ్ బేబి) ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ నరేందర్ రాథోడ్ ముఖ్యఅతిథిగా హాజరై కేంద్రాన్ని ప్రారంభించారు. సంతానం లేని వారు ఈ కేంద్రాన్ని సంప్రదించి ట్రీట్‌మెంట్ తీసుకుంటే కచ్చితంగా మంచి ఫలితం ఉంటుందని తెలిపారు. ఈ అవకాశం కల్పిస్తూ జిల్లా కేంద్రంలో ఈ సెంటర్‌ను ఏర్పాటు చేయడం పట్ల ఆయన హర్షం వ్యక్తం చేశారు. జిల్లా ప్రజలకు మరిన్ని మెరుగైన సేవలు అందించాలని ఆకాంక్షించారు.


కన్నుమూసిన చదువుల తల్లి

తాంసి : చదువు ప్రాధాన్యత తెలిసిన ఆమె..ఒంట్లో సత్తువ ఉన్నంత వరకు విద్యార్థులకు ఆసరా కల్పించింది..చాలా మందిని చేరదీసి చదువు నేర్పించింది..ఆమె మండల కేంద్రానికి చెందిన జనకొండ చినరాజక్క(95). వయో భారంతో గురువారం భీంపూర్ మండలం అర్లి(టి)లోని చెల్లెలు ఇంట్లో తుదిశ్వాస విడిచింది. దీంతో ఆమె ఇంట్లో ఉండి విద్యాబుద్ధులు నేర్చుకున్న పలువురు ఆమె అంత్యక్రియల్లో పాల్గొని నివాళి అర్పించి కన్నీటి వీడ్కోలు పలికారు. ఆమెకు సంతానం లేదు. మండల కేంద్రంలో ఉండే సమయంలో కరంజి, గుబిడి, అంతర్గాం తదితర గ్రామాలకు చెందిన విద్యార్థులు ఆమె ఇంట్లో ఉంటూ చదువుకుని ప్రయోజకులయ్యారు. ప్రభుత్వ ఉద్యోగాల్లో స్థిర పడ్డారు. కుల మతాలకు అతీతంగా పేద పిల్లలకు తల్లిగా నిలిచింది. దాదాపు అర్థ శతాబ్దానికి పైగా మహాకార్యం కొనసాగించింది. ఈమె ఇంట్లో ఉండి తాంసి ఉన్నత పాఠశాలలో చదువుకొని స్థిరపడిన వారంతా వారి కుటుంబాల్లో జరిగే ప్రతి శుభకార్యాలకు రాజమ్మని పిలిచి చీరసారె పెట్టి ఆశీర్వాదాలు పొందేవారు.



లోక్‌సభ సమరానికి సన్నద్ధం..!

- సభలు, యాత్రల పేరిట జనాల్లోకి పార్టీలు
- టికెట్ల కోసం అధిష్టానాల వద్దకు ఆశావాహులు
- ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో అధికారులు
- ఉమ్మడి జిల్లాలో ఊపందుకున్న రాజకీయ వేడి



ఇంద్రవెల్లిలో నిర్వహించిన సభకు హాజరైన కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు(ఫైల్)

ఉమ్మడి జిల్లాలో లోక్‌సభ సమరానికి సర్వం సిద్ధమవుతోంది. అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడంతో ఇప్పుడు అందరి దృష్టి లోక్‌సభపై కేంద్రీకృతమవుతోంది. మార్చి 9వ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ వెలువడుతుందనే ప్రచారం నేపథ్యంలో రాజకీయ పార్టీలు, ఆశావహుల్లో హడావుడి మొదలైంది. మరోపక్క పోలింగ్, కౌంటింగ్ నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లలో అధికార యంత్రాంగం నిమగ్నమైంది. నోటిఫికేషన్ ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉండేందుకు ఆయా జిల్లాల ఉన్నతాధికారులు సంసిద్ధమవుతున్నారు. ఇప్పటికే లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పోలింగ్, కౌంటింగ్ కేంద్రాలతో పాటు పీఓ, ఏపీఓ తదితర విభాగాల అధికారుల నియామకాన్ని పూర్తిచేసే నిమగ్నమయ్యారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు లోక్‌సభ నియోజకవర్గాలు ఉండగా వీటి పరిధిలో సుమారు 23లక్షల మంది ఓటర్లు ఉన్నారు. ఎన్నికల నాటికి ఈ సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంటుంది. మరోపక్క రాజకీయ పార్టీలు ఇప్పటికే ప్రచారాన్ని ప్రారంభించాయి. ఆశావహులు టికెట్ల కోసం అధిష్టానాల వద్దకు పరుగులు తీస్తుండటం ఆసక్తి కరంగా మారింది.

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ముగిసిపోవడంతో రాజకీయ పార్టీలు లోక్‌సభ సమరానికి సమాయత్తమవుతున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమితో బీఆర్‌ఎస్ అధికారాన్ని కోల్పోగా.. కాంగ్రెస్ చేజిక్కించుకున్న విషయం తెలిసిందే. పదేండ్ల తర్వాత రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో ఊపుమీదున్న హస్తం పార్టీ లోక్‌సభ స్థానాలను సైతం గెలుచుకోవాలని భావిస్తోంది. ఈ క్రమంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో రెండు స్థానాలను ఆదిలాబాద్, పెద్దపల్లి స్థానాలు ఉండగా వీటిని కైవసం చేసుకునేందుకు ప్రధాన పార్టీలు ప్రయత్నాలు ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. ఆదిలాబాద్ లోక్‌సభ పరిధిలో ఆదిలాబాద్, బోథ్, ఖానాపూర్, నిర్మల్, ముధోల్, ఆసిఫాబాద్, సిర్పూర్ నియోజకవర్గాలు ఉండగా పెద్దపల్లి లోక్‌సభ పరిధిలో మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి నియోజకవర్గాలు ఉన్నాయి. ఇప్పటికే రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ తెలంగాణ పునర్నిర్మాణం పేరిట ఆదిలాబాద్ జిల్లా ఇంద్రవెల్లిలో భారీ సభ నిర్వహించి లోక్‌సభ ఎన్నికల శంఖారావాన్ని ఇక్కడ్నుంచే పూరించి ప్రచారాన్ని ప్రారంభించింది. జిల్లాలోని రెండు లోక్‌సభ స్థానాలు చేజిక్కించుకునేందుకు సిద్ధమవుతోంది. బీజేపీ సైతం విజయ సంకల్ప యాత్రల పేరిట ఉమ్మడి జిల్లాలో ప్రచారాన్ని ప్రారంభించడం ఆసక్తికరంగా మారింది. సిట్టింగ్ స్థానాన్ని మరోసారి నిలబెట్టుకోవడంతో పాటు పెద్దపల్లిలోనూ పాగా వేయాలని భావిస్తోంది. మరోపక్క అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి చెంది అధికారాన్ని కోల్పోయిన బీఆర్‌ఎస్ ప్రస్తుతం సైలెంట్‌గా ఉంది. బీఆర్‌ఎస్ నుంచి గత ఎన్నికల్లో గెలుపొందిన పెద్దపల్లి ఎంపీ వెంకటేష్ నేత ఇటీవల కాంగ్రెస్‌లో చేరిపోయారు. బీఆర్‌ఎస్ ప్రస్తుతం స్తబ్దుగా ఉన్నా త్వరలోనే కార్యాచరణ ప్రారంభించనున్నట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇక మిగితా పార్టీలు సైతం లోక్‌సభ బరిలో నిలిచేందుకు సిద్ధమవుతుండటం ఆసక్తికరంగా మారింది.

అధిష్టానాల వద్దకు ఆశావహులు..!

ప్రధాన పార్టీల నుంచి బరిలో నిలిచేందుకు పలువురు ఆశావహులు సిద్ధమవుతున్నారు. ఇందులో కొందరు ఇప్పటికే ఆయా పార్టీల నుంచి బరిలో ఉంటామని బహిరంగంగా ప్రచారం చేస్తున్నారు. మరికొందరు మీడియా, సోషల్ మీడియా ద్వారా వారి ప్రచారాన్ని ప్రారంభించడం చర్చనీయాంశమవుతోంది. ఆదిలాబాద్ లోక్‌సభకు కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచేందుకు ఏకంగా 22మంది ఆశావహులు దరఖాస్తులు చేసుకున్నారు. ఇందులో పార్టీ నాయకులతో పాటు ప్రముఖ వైద్యులు, ఆయా శాఖల అధికారులు, ప్రముఖులు ఉండటం గమనార్హం. ఇక బీజేపీ నుంచి ఈ లోక్‌సభ స్థానంలో సిట్టింగ్ ఎంపీ ఉన్నప్పటికీ పలువురు టికెట్ ఆశిస్తూ ప్రచారం నిర్వహిస్తుండటం చర్చనీయాంశంగా మారింది. ఆయా పార్టీల అధిష్టానాల ముఖ్యులను కలుస్తూ టికెట్ కేటాయించాలని విన్నవించడం ప్రాధాన్యం సంతరించుకుంది. ఇక బీఆర్‌ఎస్ నుంచి సైతం పలువురు పోటీ చేసేందుకు సిద్ధమవుతున్నారు. పెద్దపల్లి బరిలోనూ ఈ ప్రధాన పార్టీల నుంచి ఆశావహుల సంఖ్య భారీగానే ఉండటం ప్రాధాన్యం సంతరించుకుంది.

సిద్ధం చేస్తున్న అధికారులు..!

లోక్‌సభ ఎన్నికల నిర్వహణనకు అధికార యంత్రాంగం సర్వం సిద్ధం చేస్తోంది. ఇప్పటికే ఆయా జిల్లాల వారీగా ఉన్నతాధికారులు సమీక్షలు నిర్వహించి దిశానిర్దేశం చేశారు. అవసరమైన పోలింగ్ కేంద్రాలు, సిబ్బంది వివరాలను సేకరించి కంప్యూటర్‌లో క్రోడీకరిస్తున్నారు. ఇప్పటికే ఆదిలాబాద్ జిల్లాలో 592 పోలింగ్ కేంద్రాలకు గాను 3560 సిబ్బంది అవసరమని గుర్తించారు. నిర్మల్ జిల్లాలో 922 పోలింగ్ కేంద్రాల్లో 5532 మంది, కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో 598 కేంద్రాలకు 3590 సిబ్బంది, మంచిర్యాల జిల్లాలో 741 పోలింగ్ కేంద్రాల్లో 4445 మంది సిబ్బంది అవసరమని గుర్తించి సిద్ధం చేశారు. వీటితో పాటు కౌంటింగ్, రిసిప్షన్ కేంద్రాలను సైతం గుర్తించినట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి.



ఎన్నికల ఏర్పాట్ల సమావేశంలో అధికారులు(ఫైల్)

పార్లమెంట్ ఎన్నికలకు సహకరించాలి

- నిర్మల్ కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్



నవతెలంగాణ-నిర్మల్

రాబోవు పార్లమెంట్ ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు సహకరించాలని కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో పార్లమెంట్ ఎన్నికల నిర్వహణపై ఆయన వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రశాంత వాతావరంలో ఎన్నికల నిర్వహణకు రాజకీయ పార్టీలు తమ సహాయ సహకారాలు అందించాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల కోసం 1564 బ్యాలెట్ యూనిట్లు, 1067 కంట్రోల్ యూనిట్లు, 1322 వీవీ ప్యాట్‌ల మొదటి దశ తనిఖీలు నిర్వహించి పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. జాబితాలను రాజకీయ పార్టీలకు అందజేయడం జరిగిందన్నారు. జిల్లాకు అదనంగా కేటాయించబడిన ఈవీఎం తనిఖీలు ఈ నెల 26 నుండి ప్రారంభమవుతాయని, రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని సూచించారు. అలాగే తుది ఓటర్ల జాబితాను ఈ నెల 8 న ప్రచురించడం జరిగిందని, నిర్మల్, ఖానాపూర్, ముధోల్ నియోజకవర్గాలలోని 922 పోలింగ్ కేంద్రాలలో ఓటర్లుగా 379880 మహిళలు, 353786 పురుషులు, 51 ఇతరులు ఉన్నారని తెలిపారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఫామ్ 6 పూరించి ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాను క్షేత్ర స్థాయిలో పరిశీలించి నకిలీ, మరణించిన వంటి ఓటర్లను తొలగించడం జరుగుతుందని తెలిపారు. సమగ్ర ఓటరు జాబితాను రూపొందించేందుకు రాజకీయ పార్టీలు సహకరించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కిషోర్ కుమార్, ఆర్డీఓ రత్నకల్యాణి, ఎన్నికల విభాగం పర్యవేక్షకులు శ్రీనివాస్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు జగన్ మోహన్, శ్రావణ్‌రెడ్డి, రవికుమార్, సయ్యద్ హైదర్, గంగ్రత్ రమేష్, సయ్యద్ మజార్, సిరికొండ రమేష్, నూతన్‌కుమార్ పాల్గొన్నారు.


గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం



నవతెలంగాణ-సిరికొండ

గ్రామాల అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వంతోనే సాధ్యమవుతుందని ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ అన్నారు. గురువారం మండలంలోని కన్నపూర్, ముత్యంపేట్, పోచంపల్లి, లక్ష్మీపూర్, రాజంపేట్, ధర్మసాగర్ ఫకీర్ నాయక్‌తండా, రాంనగర్, భీంపూర్ గ్రామాలలో మంజూరైన సీసీరోడ్లకు భూమి చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశాలలో మాట్లాడారు. నియోజకవర్గాన్ని అన్ని రంగాలలో అభివృద్ధి చేస్తానన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేరుస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర నెలలు పూర్తి కానేలేదని, ప్రతిపక్ష నాయకులు ఆరు గ్యారెంటీలను అమలు చేయాలని గగ్గోలు పెడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం పదేళ్ల పాలనలో ఏ ఒక్క ఆదివాసీ బిడ్డకు డబుల్ బెడ్ రూం ఇల్లు ఇవ్వలేదని, ఆదివాసీ గ్రామాల వైపు కనీసం కన్నెత్తి చూడలేదని అన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన ప్రభుత్వం కుదుట పడటానికి కొంత సమయం పడుతుందని తెలిపారు. మండలంలో నెలకొన్న సమస్యలను తప్పక పరిష్కరిస్తానని అన్నారు. అనంతరం కొండాపూర్ గ్రామ సమీపంలోని చిక్మాన్ వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పెందూర్ అమృత్‌రావ్, జెడ్పీటీసీ చంద్రకళ, ఎంపిడిఓ బాలగంగాధర్, డిప్యూటీ తహసీల్దార్ ఉపేందర్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఇమామ్, నాయకులు పాండు, రఘురాం, అమృత్‌రావ్, అనిల్ కుమార్, బషీర్, ప్రవీణ్, గుణవంత్‌రావ్ పాల్గొన్నారు.

మార్కెట్ కమిటీ చైర్మన్‌ను కలిసిన ఏడీ



నవతెలంగాణ-బోథ్

నూతనంగా నియమితులైన మార్కెట్ కమిటీ చైర్మన్ బొడ్డు గంగారెడ్డిని గురువారం ఏడీ శ్రీనివాస్, మార్కెట్ సెక్రెటరీ మనోహర్ మర్యాదపూర్వకంగా కలిశారు. బొకేను అందించి శుభాకాంక్షలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తుల రమేష్, విజయ్‌భాస్కర్‌రెడ్డి సైతం కలిసి సన్మానించారు.

పూలే దంపతుల విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

- బీసీ సంఘాల ఆధ్వర్యంలో ఏసీపీకి వినతిపత్రం



నవతెలంగాణ-జైపూర్

కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామంలో మహాత్మా పూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని వివిధ బీసీ బహుజన సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. గురువారం జైపూర్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ వెంకటేశ్వర్లును కలిసి వినతిపత్రం అందజేశారు. కోటపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బోరంపల్లి గ్రామంలో బుధవారం రాత్రి కొందరు దుండగులు మహాత్మ పూలే సావిత్రిబాయి పూలేల విగ్రహాలను ధ్వంసం చేశారని తెలిపారు. ఆగ్రహించిన గ్రామస్తులు దుండగులను పట్టుకుని బంధించి పోలీసులకు అప్పజెప్పారని తెలిపారు. మహాత్మ జ్యోతిబా పూలే దేశంలోని బడుగు వర్గాల సంక్షేమం కోసం ఉద్యమించిన మహానుభావుడని, దేశమంతా ఆయన్ని గౌరవిస్తూ పూజలు చేస్తోందని తెలిపారు. ఈ వార్త విన్న జిల్లా ప్రజలు ఆందోళనకు గురవుతున్నారన్నారు. నిందితులను శిక్షించడంతోపాటు ఈ దుస్సంఘటనకు కారకులైన వారందరినీ అదుపులోకి తీసుకుని భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ ఐక్య వేదిక జిల్లా కన్వీనర్ వడ్డేపల్లి మనోహర్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు డాక్టర్ నీలకంఠేశ్వర్‌గౌడ్, సామాజిక న్యాయ వేదిక కన్వీనర్ రంగు రాజేశం, బహుజన ఐక్యవేదిక నాయకులు దుర్గం ఎల్లయ్య, బీసీ ఐక్యవేదిక జిల్లా కమిటీ నాయకులు సమ్ము రాజయ్య, చల్లపల్లి అంజయ్య, రాసపల్లి రాజు, నూతన్ కుమార్ పాల్గొన్నారు.

తలమడుగు : మహాత్మ జ్యోతిరావు, సావిత్రి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని మాలి మహా సంఘం రాష్ట్ర అధ్యక్షులు సుకుమార్ గురువారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పూలే దంపతుల విగ్రహాలను ఉద్దేశపూర్వకంగా ధ్వంసం చేశారన్నారు. సామాజిక మార్పు, బహుజన కులాల అభ్యున్నతి కోసం, స్త్రీ విద్య, స్త్రీ సాధికారత కోసం ఆజన్మాంతం కృషి చేసిన మహోన్నత వ్యక్తుల విగ్రహాలను కించపర్చడం తగదన్నారు.

ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గుడిహత్నూర్ మండల కేంద్రంలోని ప్రాథమికోన్నత పాఠశాలను గురువారం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పదవ తరగతి చదువుతున్న విద్యార్థుల తరగతి గదికి వెళ్లి పరిశీలించారు. విద్యార్థులను పాఠ్యాంశాలపై అడిగి తెలుసుకున్నారు. బోధనపై విద్యార్థులతో అన్ని పాఠ్యాంశాలపై మంచి శ్రద్ధ వహించి, ప్రత్యేక తరగతులు నిర్వహించి 10/10 ఉత్తీర్ణత సాధించేలా అవగాహన కల్పించాలని ఉపాధ్యాయులను ఆదేశించారు. మధ్యాహ్న భోజనంపై విద్యార్థులను అడిగి తెలుసుకొని, వంటను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఆయన వెంట తహసీల్దార్ కవితారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు దేవదాస్, ఉపాధ్యాయులు ఉన్నారు.

మోడీని మళ్లీ పీఎం చేయడమే లక్ష్యం



నవతెలంగాణ-ఉట్నూర్

మోడీని మరోసారి ప్రధాన మంత్రిని చేయడమే విజయ సంకల్ప యాత్ర లక్ష్యమని మాజీ మంత్రి, బీజేపీ నాయకులు ఈటల రాజేందర్ అన్నారు. అంబేద్కర్‌చౌక్ వద్ద గురువారం బీజేపీ ఆధ్వర్యంలో కార్నర్ మీటింగ్ జరిగింది. ఎంపీ సోయం బాపురావు, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్, జడ్పీ చైర్మన్ జనార్ధన్ రాథోడ్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్‌తో కలిసి ఈటల రాజేందర్ మాట్లాడారు. దేశం అభివృద్ధి చెందాలంటే మోడీ మరోసారి పీఎం కావాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హిందువులంతా బిజెపికి ఓటు వేయకపోవడంతోనే అధికారంలోకి రాలేకపోయిందని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండు నెలలు గడిచిపోయినా ఆరు గ్యారంటీలను అమలు చేయలేదని ఆరోపించారు. రూ.500కే గ్యాస్ ప్రజలకు అందడం లేదని, రూ.2లక్షల రుణమాఫీ అమలు కావడం లేదని తెలిపారు. దేశంలో మోదీ రాజ్యం రావాలో, రాహుల్ గాంధీ రాజ్యం రావాలో ప్రజలే నిర్ణయించుకోవాలని పేర్కొన్నారు. ఎంపీ సోయం బాపురావు, ఎమ్మెల్యే పాయల్ శంకర్, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్ మాట్లాడుతూ గల్లీలో ఎవరున్నా దేశంలో మోడీ ఉండాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. అమలు కాని హామీల అమలతో కాంగ్రెస్ మోసం చేసిందని మండిపడ్డారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు కేంద్రం నుంచి వచ్చిన నిధులను దారి మళ్లించిందని విమర్శించారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

ఇంద్రవెల్లి : కాంగ్రెస్ పార్టీకి త్వరలో జరగబోయే ఎంపి ఎన్నికల్లో ఓట్లతో తగిన బుద్ధి చెప్పాలని మాజీ మంత్రి, బీజేపీ నాయకుడు ఈటల రాజేందర్ అన్నారు. ఆ పార్టీ ఆధ్వర్యంలో తలపెట్టిన బీజేపీ సంకల్ప బస్సు యాత్ర గురువారం మండల కేంద్రానికి చేరుకుంది. ముందుగా ముత్నూర్ గ్రామంలో కుమురం భీం విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం ఇంద్రవెల్లి చేరుకొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వంద రోజుల్లో ఆరు గ్యారంటీ పథకాలను అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్‌కు వచ్చే ఎంపీ ఎన్నికల్లో గుణపాఠం చెప్పాలన్నారు. ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న రామ మందిర నిర్మాణం కల మోడీ హయాంలో నేరవేరిందన్నారు. యాత్ర సందర్భంగా పలువురు యువకులు బీజేపీలో చేరారు. యూత్ మండల అధ్యక్షునిగా ముండే సాయినాథ్‌ను నియమించారు. ఈ కార్యక్రమంలో ఎంపి సోయం బాపురావ్, బీజేపీ జిల్లా అధ్యక్షులు పథంగే బ్రహ్మానంద్, అయ్యన్నగారి భూమన్న, ఖానాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి మహేందర్, రాజేష్ బాబు, మాజీ ఎంపీ రమేష్ రాథోడ్, అభినవ్ సర్దార్, మాజీ ఎమ్మెల్యే రాథోడ్ బాపురావ్, మండల అధ్యక్షులు అరెల్లి రాజలింగు, కేంద్రే బాలాజీ పాల్గొన్నారు.



తహసీల్దార్‌కు సన్మానం

నవతెలంగాణ-లక్ష్మణచాంద



తహసీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన జానకిని జడ్పీటీసీ ఓస రాజేశ్వర్ గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువాతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. ఆయన వెంట నాయకులు జహీర్, బిట్లింగ్ నారాయణ, కల్లెడ భూమన్న ఉన్నారు.

యూరియాను అధిక ధరలకు అమ్ముతున్న వారిపై చర్యలు తీసుకోవాలి

నవతెలంగాణ-ఇచ్చోడ



మండల కేంద్రంలోని ఆగ్రోస్ రైతు సేవా కేంద్రం, ప్రయివేట్ ఫర్టిలైజర్స్ షాప్‌లలో యూరియను అధిక ధరలకు అమ్ముతున్నారని రైతు స్వరాజ్య వేదిక జిల్లా అధ్యక్షులు సంగెపు బొర్రన్న ఆరోపించారు. ఒక బ్యాగ్ ధర రూ.266 ఉంటే 50, 60 రూపాయలకు పెంచి అమ్ముతున్నారన్నారు. వ్యవసాయ శాఖ అధికారుల పర్యవేక్షణ లోపం కనిపిస్తోందన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి రైతులకు న్యాయబద్ధ ధరలకు యూరియా అందించాలని డిమాండ్ చేశారు.

ఇంటి పన్ను వసూలును 29లోపు పూర్తి చేయాలి



నవతెలంగాణ-నిర్మల్

ఇంటి పన్ను వసూలును 29లోపు వంద శాతం పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మున్సిపల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో మున్సిపల్ పన్ను వసూలుపై ఆయన సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ వందశాతం ఇంటి పన్ను వసూలుకు పటిష్ట చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. జిల్లాలోని నిర్మల్, భైంసా, ఖానాపూర్ మున్సిపాలిటీల పరిధిలోని ప్రభుత్వ, ప్రయివేటు కార్యాలయాలు, వాణిజ్య సముదాయాలు, అలాగే ఇంటిపన్నును వసూలు చేయాలని సూచించారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 29 వరకు పన్ను చెల్లించని యజమానులకు నోటీసులు జారీ చేసి సీజ్ చేయాలని సూచించారు. అనంతరం మున్సిపాలిటీల వారీగా పన్ను వసూలుపై చర్చించారు. ఈ సమావేశంలో నిర్మల్, భైంసా, ఖానాపూర్ కమిషనర్లు సివిఎస్ రాజు, వెంకటేశ్వర్‌రావు, మనోహర్ పాల్గొన్నారు.

హర్యానా ప్రభుత్వాన్ని బర్తరఫ్ చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్

రైతులపై కాల్పులు జరిపిన హర్యానా ప్రభుత్వాన్ని వెంటనే బర్తరఫ్ చేయాలని సిపిఐ(ఎంఎల్) న్యూడెమొక్రసీ జిల్లా నాయకులు సునారికారి రాజేష్ అన్నారు. గురువారం పట్టణంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ప్రజాస్వామ్య పద్ధతిలో తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని శాంతియుతంగా ఆందోళన చేస్తున్న రైతులపై అమానుషంగా కాల్పులు జరిపారన్నారు. కాల్పుల్లో పంజాబ్ రాష్ట్రం బటిండా జిల్లాలోని బాలన్ గ్రామానికి చెందిన శుభకరంసింగ్ మరణించాడని, చాలా మంది రైతులు గాయాలతో ఆసుపత్రి పాలయ్యారని తెలిపారు. కాల్పులకు తెగబడిన హర్యానా పోలీసులను వెంటనే హత్యా నేరం కింద అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కాల్పుల సంఘటనపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో సమగ్ర విచారణ జరిపించాలని కోరారు.

10న అఖిల భారత మహాసభను జయప్రదం చేయండి



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

వచ్చే నెల 10న మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో జరుగే అఖిల భారత ఫాసిస్ట్ వ్యతిరేక మహాసభను విజయవంతం చేయాలని మానవ హక్కుల వేదిక రాష్ట్ర అధ్యక్షులు ఆత్రం భుజంగ్‌రావ్ అన్నారు. గురువారం అమరవీరుల స్థూపం వద్ద విలేకరులతో మాట్లాడారు. పిఎం నరేంద్ర మోడీ హయాంలో ఆర్‌ఎస్‌ఎస్ ఫాసిస్ట్ వాదాన్ని పెంచి పోషిస్తున్నారని ఆరోపించారు. ప్రజల సమస్యలను పక్కన పెట్టి ఫాసిస్ట్ వాదాన్ని పెంచుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజాస్వామ్యం, రిజర్వేషన్, లౌకికవాదం కాపాడాలని నినాదంతో మహాత్మా జ్యోతిబాపూలే భవనంలో ఈ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సమ్మేళనానికి బారిస్టర్ ఖోబ్రాగడే ముఖ్య అతిథిగా హాజరవుతున్నారని, విద్యావంతులు,ఎ సేధావులు, రాజ్యాంగ పరిరక్షకులు, కమ్యూనిస్ట్ వాదులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సిపిఐ(ఎంఎల్)రెడ్‌స్టార్ పోస్టర్లను విడుదల చేశారు. ఈ విలేకరుల సమావేశంలో పెందోర్ ప్రియాంక, ఎఎస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి సెడ్మకి రామారావ్, ఆత్రం సుశీల, లింబాబాయి, అర్క ఓమేష్ పాల్గొన్నారు.

అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి



నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని జూనియర్ కాలేజీలో గురువారం స్వాతంత్ర్య సమర యోధులు, భారత తొలి విద్య మంత్రి అబుల్ కలాం ఆజాద్ వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రాజురా సత్యం, తహసీల్దార్ శివరాజ్, ఏఎస్ఐ మణిరాం, మాజీ వైస్ చైర్మన్ అబ్దుల్ ఖలీల్, కాంగ్రెస్ మండల కార్యదర్శి షబ్బీర్ పాషా, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షులు సురేష్, కాంగ్రెస్ మండల మైనార్టీ అధ్యక్షులు సలీంఖాన్, పట్టణ అధ్యక్షులు నిమ్మల రమేష్, సీనియర్ నాయకులు కడర్ల గంగనర్సయ్య, కాంగ్రెస్ మైనార్టీ పట్టణ అధ్యక్షులు షౌకత్ పాషా, సయ్యద్ ఆయుబ్, మీర్జా బేగ్, ఎంఐఎం నాయకులు అఖిల్, అఫ్సర్ పాల్గొన్నారు.

అలేఖ్య కుటుంబానికి న్యాయం చేయాలి

నవతెలంగాణ-ఖానాపూర్



ఇటీవల పట్టణ నడిరోడ్డుపై అత్యంత దారుణంగా హత్యకు గురైన అలేఖ్య కుటుంబానికి న్యాయం చేయాలని కోరుతూ గురువారం అఖిలపక్షం ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో కలిసి ఎస్పీ జానకి షర్మిలను కలిశారు. ఘటన జరిగిన తీరు, కుటుంబానికి జరిగిన అన్యాయాన్ని ఎస్పికి అలేఖ్య తల్లిదండ్రులు వివరించారు. హంతకుడు శ్రీకాంత్, అతనికి సహకరించిన తల్లి సత్తవ్వ, తమ్ముడు శివకృష్ణను కఠినంగా శిక్షించాలని అఖిలపక్షం నాయకులు, అలేఖ్య కుటుంబ సభ్యులు ఎస్పీని కోరారు. ఈ ఘటనలో తీవ్ర గాయాలపాలై ఆసుపత్రిలో చికిత్స పొందిన అలేఖ్య వదిన జయశీల సైతం ఎస్పీని కలిసి జరిగిన విషయాన్ని వివరించారు. గాయాలతో ఉన్న జయశీలను, కోలుకుంటున్న కుమారుడు రియన్స్‌ను ఎస్పీ పరిశీలించారు. అనంతరం ఎస్పీ జానకి షర్మిలా మాట్లాడుతూ కేసు విచారణ వేగవంతం చేసేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు కోసం పోలీస్ శాఖ తరపున ప్రభుత్వానికి నివేదిక పంపుతున్నామన్నారు. అలేఖ్య హత్య కేసులో నిందితులకు శిక్ష పడుతుందని పేర్కొన్నారు. ఎస్పీని కలిసిన వారిలో సిపిఐ(ఎంఎల్) ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య, ప్రజాసంఘాలు, అఖిలపక్షం నాయకులు కె.రాజన్న, జన్నారపు శంకర్, నాగెల్లి నర్సయ్య, ప్రణీత్, కె.వెంకటస్వామి, మోహన్, రాకేష్, పురుషోత్తం, రామ్, లక్ష్మణ్ ఉన్నారు.

బీజేపీ ఆదిలాబాద్‌లో ఒక్క అభివృద్ధి పని చేపట్టలేదు

- బండి సంజయ్ వ్యాఖ్యలను ఖండించిన రామన్న



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

కేంద్ర ప్రభుత్వం కోటీ62లక్షల కోట్ల బాకీని సామాన్య ప్రజలపై మోపిందని, సిసిఐ, ఎయిర్‌పోర్టు, ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వేలైన్ వాటిలో ఏ ఒక్క పని చేయలేదని మాజీ మంత్రి జోగు రామన్న అన్నారు. ఎన్నికల సమయంలోనే బీజేపీ నేతలకు యాత్రలు గుర్తుకు వస్తాయని, కేవలం అబద్ధాలు, అసత్య ప్రచారాలు చేయడానికే యాత్రలు నిర్వహిస్తున్నారని మండిపడ్డారు. గురువారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో బీజేపీ నేత బండి సంజయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండించారు. తెలంగాణ అభివృద్ధిని కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విస్మరించిందని, కేంద్రం పరిధిలోని ఎటువంటి అభివృద్ధి పని జరగలేదని అన్నారు. తెలంగాణ నుండి పన్నుల రూపంలో కేంద్రానికి కట్టిన దాని కంటే రాష్ట్రం కోసం కేటాయించిన నిధులు చాలా తక్కువని తెలిపారు. ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వే లైన్ గురించి కూడా స్థానిక ఎంపీ పచ్చి అబద్ధాలు మాట్లాడారని, రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ విగ్రహం ఎదురుగా అసత్య ప్రచారాలు చేశారని మండిపడ్డారు. రైల్వేలైన్ పనుల గురించి ఇప్పటికీ సర్వే మొదలు పెట్టలేదని, డిపిఆర్ ఇవ్వలేదని పేర్కొన్నారు. కాంగ్రెస్, బీజేపీ స్థానిక సంస్థల్లో ఒక్కటై పని చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించకుండా కెసిఆర్‌పై విమర్శలు చేయడమే నిదర్శనమన్నారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చేంత వరకు ప్రజల పక్షాన నిలబడుతూ వారికి అండగా ఉంటామని పునరుద్ఘాటించారు. కార్యక్రమంలో బిఆర్ఎస్ జిల్లా ఉపాధ్యక్షులు విజ్జగిరి నారాయణ, జోహర్‌బాయ్, అశోక్ స్వామి, శ్రీనివాస్, రామ్‌కుమార్, నవాతే శ్రీనివాస్, ఆసిఫ్‌పాల్గొన్నారు.

మహిళలు అక్షరాస్యతతో అభివృద్ధి సాధించొచ్చు

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



మహిళలు అక్షరాస్యతతోనే అభివృద్ధి సాధించవచ్చని మహిళా సాధికారత జెండర్ స్పెషలిస్ట్ కృష్ణవేణి అన్నారు. గురువారం మండల కేంద్రంలోని సహజ్యోతి మండల మహిళా సమాఖ్య కార్యాలయంలో మహిళా శిశు సంక్షేమ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో మహిళా సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నేటి సమాజంలో మహిళలు తమ హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉంటేనే అభివృద్ధి సాధిస్తారని, సమాజంలో మహిళలు పురుషులతో పోటీపడుతూ అన్ని రంగాలలో ముందుకు సాగుతున్నారని తెలిపారు. వారికి మహిళా చట్టాలపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరి పై ఉందన్నారు. అనంతరం బాలల హక్కులు, బాల్య వివాహాలను, పిసిపిఎన్డిఆర్ గర్భ లింగ నిరోధక నిర్ధారణ, పోక్సో యాక్ట్, గృహహింస చట్టం సైబర్ క్రైమ్స్ పనిచేసే ప్రదేశాలలో లైంగిక వేధింపుల చట్టం, మిగతా మహిళా చట్టాల గురించి సఖి సర్వీసెస్ గురించి జెండర్ స్పెషలిస్ట్ కోటేశ్వర్ వివరించారు. అనంతరం ఆర్థిక అక్షరాస్యత నిపుణుడు నిఖిల్ మాట్లాడుతూ సుకన్య సమృద్ధి యోజన, ముద్రా యోజన, విశ్వకర్మ యోజన గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మండల సమైక్య ఏపీఎం పవర్ గణేష్, సిసి శంకర్ యాదవ్, మహిళా సమైక్య సభ్యురాలు, వీవో లీడర్స్ పాల్గొన్నారు.

ఘనంగా విశ్వకర్మ జయంతి వేడుకలు



నవతెలంగాణ-బేల

విశ్వకర్మ జయంతి వేడుకలను మరాఠీ వడ్రంగి కులస్థులు గురువారం ఘనంగా జరుపుకున్నారు. సంఘ భవనంలో నిర్వహించిన వేడుకల్లో మాజీ మంత్రి జోగు రామన్న, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు సుహాసినిరెడ్డితో పాటు వివిధ పార్టీల నాయకులు హాజరై విశ్వకర్మ చిత్ర పటానికి పూజలు నిర్వహించారు. ప్రపంచ నిర్మాణంలో విశ్వకర్మ గొప్పతనాన్ని మాజీ మంత్రి జోగు రామన్న కీర్తించారు. విశ్వకర్మలు అన్ని రంగాల్లో ముందుండాలని, వారి సమస్యల పరిష్కారంలో అండగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ జిల్లా మాజీ చైర్మన్ రావుత్ మనోహర్, ఎంపిటిసి జ్యోతి, మాజీ ఎంపిపి రఘుకుల్‌రెడ్డి, బిఆర్ఎస్ నాయకులు ఠాక్రె గంభీర్, దేవన్న, ప్రమోద్‌రెడ్డి, సతీష్ పవార్, కాంగ్రెస్ నాయకులు ఫైజుల్లా ఖాన్, సంజయ్ గుండావార్, సుధాంరెడ్డి, సామ రూపేష్‌రెడ్డి, బీజేపీ నాయకులు దత్త నిక్కం, మురళీధర్, రాకేష్, సంఘం జిల్లా అధ్యక్షులు జాన్వే సంతోష్, మండల అధ్యక్షులు అభయ్ మానుస్మారె, అతుల్, రాకుండే వెంకన్న, విష్ణుదాస్, దయాకర్ పాల్గొన్నారు.

పదో తరగతి విద్యార్థులకు పరీక్షలపై అవగాహన



నవతెలంగాణ-తలమడుగు

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో పదవ తరగతి విద్యార్థులకు గురువారం ప్రముఖ పోటీ పరీక్షల నిపుణులు అల్లం సాయికృష్ణ, రమణగౌడ్ గొడిసెల పరీక్షలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు పదోతరగతి పరీక్షలపై విద్యార్థులకు ఉన్న అపోహలు, సందేహాలను నివృత్తి చేశారు. పరీక్షలు సమీపిస్తున్న తరుణంలో విద్యార్థులు ఒత్తిడికి గురికాకుండా ఉండడానికి పాటించాల్సిన నియమ నిబంధనలను వివరించారు. పరీక్షలకు ముందున్న సమయాన్ని విద్యార్థులు ఏవిధంగా వినియోగించుకోవాలి, ఎలా చదివితే ఎక్కువ మార్కులు సాధించవచ్చు, పరీక్ష సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులు అడిగిన పలు సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి.వెంకట్‌రావ్, మాజీ విద్యా కమిటీ చైర్మెన్ గంగన్న, ఉపాధ్యాయులు రాజేందర్, లలిత, వినోద్‌రెడ్డి, వెంకటేశ్వర్, మురళీధర్, రాకేష్, రవీంద్రకుమార్, స్వప్న, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

సహకార శాఖ నాన్ గజిటెడ్ అధికారుల సంఘం డైరీ ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సహకార శాఖ నాన్ గెజిటెడ్ అధికారుల సంఘం డైరీని జాయింట్ రిజిస్ట్రార్ జిల్లా సహకార అధికారి బి.మోహన్ ఆవిష్కరించారు. గురువారం పట్టణంలోని సహకార శాఖ కార్యాలయంలో సంఘం సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. అనంతరం మోహన్ మాట్లాడుతూ డైరీలో సహకార సంఘాలకు సంబంధించిన సమాచారం బాగుందన్నారు. ఉద్యోగులకు ఉపయోగపడే విధంగా డైరీ రూపకల్పన చేసిన సంఘ సభ్యులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సహకార శాఖ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు ఎ.నవీన్ కుమార్, కార్యదర్శి సి.విక్రాంత్, కార్యాలయ పర్యవేక్షకుడు డి.అత్మారాం, సభ్యులు సుజాత, లక్ష్మి, నితిన్, సంజయ్, ఆశాజ్యోతి, రజిత, వినయ్‌కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధికి కృషి



నవతెలంగాణ-కుభీర్

మండలంలోని గ్రామాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందని కాంగ్రెస్ యువజన సంఘం అధ్యక్షుడు రథోడ్ లవకుష్ అన్నారు. గురువారం మండలంలోని రామనాయక్ తండాలో ఉపాధి హామీ కింద మంజూరైన రూ.2లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణానికి మాజీ జడ్పీటీసీ శంకర్ చవన్‌తో కలిసి భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీ హామీలను అమలు చేస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు యశ్వంత్, కారోబారి రవీందర్ పాల్గొన్నారు.

ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలి



నవతెలంగాణ-లక్ష్మణచాంద

ఓటరు జాబితాను పకడ్బందీగా తయారు చేయాలని తహసీల్దార్ జానకి అన్నారు. గురువారం బీఎల్ఓల సమావేశంలో మాట్లాడారు. మరణించిన ఓటరు పేర్లను తొలగించాలని, చేర్పులు మార్పులు చేయడంతో పాటు నూతన ఓటరు దరఖాస్తులను స్వీకరించాలని తెలిపారు. ప్రభుత్వం అనుమతి ఇచ్చినప్పుడు ఆన్‌లైన్‌లో పూర్తి చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో డిప్యూటీ తహసీల్దార్ అజీజ్, ఆర్ఐలు దేవిక, నరేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

నీటి సమస్యలు లేకుండా చూడాలి



నవతెలంగాణ-ఉట్నూర్

మండలంలోని నీటి సమస్యలు లేకుండా చూడాలని ఎంపీపీ పంద్ర జైవంత్‌రావ్ అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, మండల పంచాయతీ కార్యదర్శులతో సమావేశం ఏర్పాటు చేసి వేసవిలో నీటి సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. మండలంలో మారుమూల గ్రామాలున్నాయని, చాలా గ్రామాల్లో వేసవిలో నీటి సమస్యలు తలెత్తుతాయని తెలిపారు. అధిగమించేందుకు అధికారులు పనిచేయాలని, అందరికీ మంచినీరు సరఫరా అయ్యేలా చూడాలని తెలిపారు. 15 రోజులకు ఒకసారి రివ్యూ మీటింగ్ ఉంటుందని చెప్పారు. సమావేశంలో ఎంపీడీవో మురళీధర్ శర్మ ఎంపీ లింగయ్య ఆర్‌డబ్ల్యుఎస్ ఏఈ, మండల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

24 నుండి సోయా కొనుగోలు ప్రారంభం

నవతెలంగాణ- జైనథ్

రైతుల వద్ద నుండి సోయాబీన్ పంటను కొనుగోలు చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు డీసీసీబీ డైరెక్టర్, జైనథ్ పీఏసీఎస్ చైర్మెన్ బాలూరి గోవర్ధన్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. క్వింటాల్‌కు రూ 4,600 చొప్పున సోయాబిన్ కొనుగోలు చేయడానికి కేంద్రాలను ఈనెల 24 నుండి మార్చి 5వ తేదీ వరకు తెరిచి ఉంచేందుకు అనుమతిచిన్నట్లు పేర్కొన్నారు. జిల్లా అదనపు కలెక్టర్, మార్క్‌ఫెడ్ అధికారులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
కుమురంభీం ఆసిఫాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 23, 2024 | www.navatelangana.com

జాతరకు ముస్తాబైన ఆలయం



నవతెలంగాణ-దహెగాం

మండలంలోని బీబ్రా గ్రామంలో గల శ్రీ లక్ష్మీ వెంకటేశ్వర సహిత సద్గురు సాయినాథ దేవాలయం జాతరకు ముస్తాబైంది. ప్రతి సంవత్సరం మాఘ శుద్ధ పౌర్ణమి (గంగపూర్ పౌర్ణమి)నాడు జాతరను నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడు బండ రమేష్ ఆలయ అర్చకులు బాచం పల్లి కిషోర్ శర్మ తెలిపారు. శనివారం ఉదయం సుప్రభాత సేవ పాలభిషేకం ప్రత్తేక దర్శనం మధ్యాహ్నం స్వామివారి కల్యాణం అనంతరం అన్నదాన కార్యక్రమం సాయంత్రం పల్లకీ సేవా కార్యక్రమంతొ పాటు రాత్రి లక్ష్మీ మహతి స్వర మాధురి బందం మంచిర్యాల వారిచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

జ్వరంతో మైనార్టీ పాఠశాల విద్యార్థిని మృతి

నవతెలంగాణ-వాంకిడి

జిల్లా కేంద్రంలోని మైనార్టీ పాఠశాలలో చదువుతున్న ఎస్‌కె. అంజూం(14) 9వ తరగతి చదువుతున్న బాలిక జ్వరంతో మృతి చెందిన సంఘటన గురువారం మండల కేంద్రంలో చోటుచేసుకుంది. మండల కేంద్రానికి చెందిన కరీం కూతురు జిల్లా కేంద్రంలోని మైనార్టీ పాఠశాలలో 9వ తరగతి చదువుతోంది. గత రెండు రోజులుగా జ్వరంతో బాధపడుతున్నట్లు తెలిపారు. గురువారం చికిత్స నిమిత్తం చంద్రపూర్ తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో తీవ్ర అస్వస్థతకు గురై మృతి చెందినట్లు తెలిపారు.



సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా నాయకులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర రాజధానిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సీపీఐ(ఎం) రాష్ట్ర విస్తృత సమావేశంలో జిల్లా నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రంను కలిసి జిల్లాలోని పలు సమస్యలు ఆయన దృష్టికి తీసుకువెళ్లి రాష్ట్ర ప్రభుత్వంతో మాట్లాడాలని కోరారు. అనంతరం వారు మాట్లాడుతూ తమ్మినేని ఆరోగ్య పరిస్థితి అడిగి తెలుసుకున్నట్లు వివరించారు. జిల్లాలో మెడికల్ కళాశాలకు అనుసంధానంగా జిల్లా ఆస్పత్రి పని చేస్తున్నప్పటికి అందులో సరిపడా వైద్యులు లేక ప్రజలకు వైద్యం అందడం లేదని, ఆపరేషన్‌కు సంబంధించి పరికరాలు ఉన్నప్పటికీ టెక్నికల్ సిబ్బంది లేకపోవడంతో నిరుపయోగంగా మారాయన్నారు. జిల్లాలో అద్దె భవనాల్లో కొనసాగుతున్న వసతి గృహాలకు సొంత భవనాలు మంజూరు అయ్యే విధంగా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఆయనను కలిసిన వారిలో సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి కూశన రాజన్న, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు కోట శ్రీనివాస్, దుర్గం దినకర్ ఉన్నారు.

ఫూలే దంపతుల విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి

- మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లెన్గురే బాలాజీ



నవతెలంగాణ-కెరమెరి

మంచిర్యాల జిల్లాలోని కోటపల్లి మండలం బోరపల్లి గ్రామంలో మంగళవారం రాత్రి పూలే దంపతుల విగ్రహణం ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని మాలీ సంఘం డివిజన్ ప్రధాన కార్యదర్శి లింగురే బాలాజీ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహనీయుల విగ్రహాలను ధ్వంసం చేయడం సిగ్గుచేటని పేర్కొన్నారు. సమాజ చైతన్యానికి పాటుపడినటువంటి పూలే దంపతుల విగ్రహాలను ధ్వంసం చేయడం అంటే యావత్తు మాలి సమాజానికి అవమానకరమని అన్నారు. విగ్రహాలు ధ్వాసం చేసిన దుండగులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో రాం కిషన్ పాల్గొన్నారు.



కౌటాల : మహాత్మా జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని, మాలి సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆదె వసంతరావు అన్నారు. మండల కేంద్రంలోని బస్టాండ్ సమీపంలో గల పూలే విగ్రహాలకు పాలాభిషేకం చేశారు. అనంతరం కుమురంభీం చౌరస్తా వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోటపల్లి మండలంలోని బోరేగాం గ్రామంలో గల మాహత్మ జ్యోతిబాపూలే సావిత్రిబాయి పూలే విగ్రహాలను ధ్వంసం చేసిన దుండగులను కఠినంగా శిక్షించాలని ఆయన డిమాండ్ చేశారు. దుండగుల వెనుక ఎంతటి వారు ఉన్న మేము దుండగులను శిక్షించేదాకా ఊరుకోబోమని హెచ్చరించారు. ప్రభుత్వం సైతం దీనిపై స్పందించి దుండగులపై కఠిన చర్యలు తీసుకునేలా చూడాలని ఆయన డిమాండ్ చేశారు. లేని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టి అనంతరం అసెంబ్లీని సైతం ముట్టడిస్తామని హెచ్చరించారు. ఆయన వెంట మాలి సంక్షేమ సంఘం మండల నాయకులు మాలి కులస్తులు ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌ను కలిసిన ఏఐటీయూసీ నాయకులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నూతనంగా ఆసిఫాబాద్ మున్సిపల్ కమిషనర్‌గా భాధ్యతలు స్వీకరించిన భుజంగరావును ఎఐటీయూసీ జిల్లా నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ కార్మికుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం ప్రయత్నం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు టి.దివాకర్, ప్రధాన కార్యదర్శి బోగే ఉపేందర్, నాయకులు చిరంజీవి, శంకర్ పాల్గొన్నారు.



పది, ఇంటర్

పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఈ నెల 28న ప్రారంభం అయ్యే ఇంటర్మీడియట్ పరీక్షలు, వచ్చే నెలలో ప్రారంభం కానున్న పదవ తరగతి పరీక్షలు నిర్వహించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బొర్కాడే హేమంత్ సూచించారు. పది, ఇంటర్ పరీక్షలకు సంబంధించి జిల్లా అదనపు కలెక్టర్ దాసరి వేణు, ఎస్పీ సురేష్ కుమార్, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి నైతం శంకర్, జిల్లా విద్యాధికారి అశోక్, డీఆర్ఓ లోకేశ్వరరావుతో కలిసి పరీక్ష కేంద్రాల సీఎస్, డిఓ, ఇతర సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరీక్షల పకడ్బందీ నిర్వహణ కోసం అధికారులు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష పత్రాలు వచ్చిన నాటి నుంచి పరీక్షలు పూర్తయి పేపర్లు తిరిగి పంపే వరకు అలసత్వం వహించకూడదన్నారు. పరీక్ష కేంద్రాల్లోకి సెల్ ఫోన్లను ఎవరు తీసుకు వెళ్ళకూడదని, అధికారులకు కూడా సెల్ ఫోన్లకు అనుమతి లేదన్నారు. మాస్ కాపీయింగ్ జరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థులను పరీక్ష కేంద్రాలకు సరైన సమయంలో చేర్చే విధంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. పరీక్ష కేంద్రాల్లో వసతులు ఏర్పాటును ముందస్తుగా చూసుకోవాలని సూచించారు. పరీక్ష సమయంలో కేంద్రాల వద్ద 144వ సెక్షన్ అమల్లో ఉండే విధంగా చూడాలని, జిరాక్స్ సెంటర్లు తెరిచి ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్షల నిర్వహణపై అలసత్వం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భవిష్యత్తులో పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలు తలెత్తితే తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డీపీఓ ఉమర్ హుస్సేన్, ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి సజీవన్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్,



10 నుంచి హాస్టల్ వర్కర్ల సమ్మె

నవతెలంగాణ-ఆసిఫాబాద్

గిరిజన ఆశ్రమ పాఠశాలలు, హాస్టల్స్ డైలీవేజ్, ఔట్సోర్సింగ్ వర్కర్స్ డిమాండ్ల పరిష్కారం కోసం మార్చి 10 నుంచి సమ్మె బాట పట్టనున్నట్లు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు టేకం ప్రభాకర్ తెలిపారు. జిల్లా కేంద్రంలోని పోస్ట్ మెట్రిక్ బాలుర వసతి గృహంలో జిల్లా నాయకుడు మాన్కు అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృత స్థాయి సమావేశానికి సంఘం గౌరవాధ్యక్షుడు కృష్ణమాచారి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజేందర్‌లతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని ఆశ్రమ పాఠశాలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ అవుట్సోర్సింగ్ డైలీవేజి వర్కర్లకు గత 9 నెలలుగా వేతనాలు చెల్లించకపోవడంతో వర్కర్లు దుర్భరమైనజీవితాన్ని గడుపుతున్నారని అన్నారు. జీతాలు లేకపోవడంతో కుటుంబాలు రోడ్డున పడే పరిస్థితి దాపురించిందన్నారు. తమను ఔట్సోర్సింగ్ విదానంలోకి మార్చే ఆలోచనను విరమించుకోవాలని, కనీసవేతనం రూ.26 వేలు నిర్ణయించి, జిల్లా వ్యాప్తంగా ఒకే హోదా అమలు చేయాలని 9నెలల పెండింగ్ వేతనాలు వెంటనే చెల్లించాలన్నారు. పనిచేస్తున్న కార్మికుల సంఖ్యకు అనుగుణంగా అవసరమైన బడ్జెట్ కేటాయించాలన్నారు. ప్రతినెల వేతనాలు చెల్లించాలని, రాష్ట్ర ప్రభుత్వ సర్క్యులర్ ప్రకారం మిగతా విభాగాలలో చెల్లించిన విధంగా గిరిజన సంక్షేమ శాఖలోని డైలీవేజ్ కార్మికులకు కూడా లాక్ డౌన్ కాలానికి పూర్తి వేతనాలు చెల్లించాలని, 14 నెలల పాటు లాక్ డౌన్ కొనసాగినందున మొత్తం కాలానికి వర్కర్లందరికీ పూర్తి వేతనం చెల్లించాలన్నారు. చనిపోయిన డైలీవేజ్, పార్టైం కార్మికుల వారసులను డైలీవేజ్ వర్కర్లుగా నియమించాలనీ డిమాండ్ చేశారు. డిమాండ్లను మార్చి 9వ తేదీ లోపు పరిష్కారం చేయకుంటే వాటి పరిష్కారం కోసం మార్చ్ 10 నుంచి సమ్మె చేస్తున్నట్టు తెలిపారు. కార్మికులంతో సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం డీటీడీఓ రమాదేవికి సమ్మె నోటీసు అందజేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు అడ శ్యాంరావ్, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు బాలకిషన్, సంఘం నాయకులు మరప రాంబాయి, కనక రవి, సునీత, ఇందిరాబాయి, సత్తుబాయి, నాందేవ్, శేఖర్, పతుబాయి, పారుబాయి, శేకు, తుకారాం, ఛాయ, ప్రమీల, మారుతి, శంకర్, వసంత్ రావ్, జ్యోతి, మధుకర్, స్వర్ణలత పాల్గొన్నారు.



డీటీడీఓకు సమ్మె నోటీస్ అందజేస్తున్న హాస్టల్ వర్కర్లు

బీమాతో కుటుంబాలకు ధీమా



నవతెలంగాణ-దహెగాం

ఎస్‌బీఐ బీమాతో కుటుంబాలు ధీమాగా ఉండొచ్చని ఎస్‌బీఐ చైర్మన్ శోభ అన్నారు. మండలంలోని కొంచవెల్లి గ్రామానికి చెందిన గురుసులే శంకర్ ట్రాక్టర్ డ్రైవర్‌గా పనిచేస్తూ ప్రమాద వశాత్తు గత సంవత్సరం ఆగస్టు 22న వీల్స్ ట్రాక్టర్ కింద పడి మృతి చెందాడు. అతడు ఎస్‌బీఐ ఇన్సూరెన్స్ రూ.1000 చెల్లించి పాలసీ తీసుకోవడంతో గురువారం అతని భార్య లావణ్య కు ఇన్సూరెన్స్ కింద రూ.20 లక్షల చెక్కును అలాగే పీఎం జేబీవై కింద మరో రూ.2 లక్షలు మరో ఇన్సూరెన్స్ పీఎం ఎస్‌బీఐ కింద రూ.2లక్షలు మొత్తం రూ.24 లక్షల చెక్కులను కాగజనగర్‌లో అందజేశారు. ఈ సందర్భంగా శోభ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఇన్సూరెన్స్ చేయించుకోవాలని అన్నారు. ఎవరు ఎప్పుడు ఎలాంటి ప్రమాదం జరువుతుందో ఎవరికి తెలియదన్నారు. తక్కువ ప్రీమియంతో కుటుంబాలు రోడ్డున పడకుండా కాపాడుకోవచని తెలిపారు. ఈ కార్యక్రమంలో రీజినల్ మేనేజర్ మురళి మనోహర్ కొంచవెల్లి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ కుమారా రాజా పాల్గొన్నారు.

ఆదివాసీ మహిళల స్థితిగతులపై పరిశీలన

నవతెలంగాణ-కెరమెరి

గోండ్వాన ఫౌండేషన్ అద్వర్యంలో ఆదివాసీ మహిళల స్థితి గతులుపై హైదరాబాద్‌కు చెందిన ప్రొఫెసర్ ఉష బుధవారం గిరి గ్రామాలను సందర్శించారు. కళ్లెగాం, కొరారి, అంబరావుగూడ గ్రామాల ప్రజలతో మాట్లాడారు. వారి ఆర్థిక స్థితిగతులు ఎదుర్కొంటున్న సమస్యలపైన చర్చించారు. ఆదివాసీ మహిళల వ్యవసాయం, పోడు భూముల వివరాలను అడిగి తెలుసుకున్నారు. పోడు భూముల వ్యవసాయంలో వారు ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో గోండ్వాన ఫౌండేషన్ చైర్మన్ సిడాం తిరుపతి, ప్రధాన కార్యదర్శి కుర్సెంగ మారుతి, జాయింట్ సెక్రటరీ శ కోవ ఇందిర, ఫౌండేషన్ సభ్యుడు కుంరం బండే రావ్ పాల్గొన్నారు.



విద్యుత్ తీగ తగిలి వ్యక్తికి గాయాలు

నవతెలంగాణ-దహెగాం

వన్యప్రాణుల వేటకు వేసిన విద్యుత్ తీగలకు తగిలి వ్యక్తికి తీవ్రగాయాలైన సంఘటన మండలంలో ఖర్జి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కరి రాకేష్ మేకల కాపరి తమ మేకలు తప్పిపోయాయని రాకేష్‌తో పాటు మరో ముగ్గురు వ్యక్తులు మేకల జాడ కోసం సమీపంలోని పత్తి చేనులోకి వెళ్లే క్రమంలో ముందు నడుస్తున్న రాకేష్ ఒకేసారి కరెంట్ షాక్‌కు గురై కుప్పకూలిపోయాడు. గమనించిన మిగతా వ్యక్తులు వన్యప్రాణుల వేట కోసం విద్యుత్ తీగలు పెట్టారని గమనించి కాళ్ళు చేతులు కాలిపోయి తీవ్ర గాయాలైన రాకేష్‌ను అంబులెన్స్‌లో మంచిర్యాల ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో అక్కడి నుంచి వరంగల్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. రాకేష్ పరిస్థితి విషమంగా ఉందన్నారు. ఈ విషయమై ఎస్సై సనత్ కుమార్‌ను సంప్రదించగా ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదు అంద లేదన్నారు. ఇప్పటికే గ్రామ గ్రామాన పోలీసుల ఆధ్వర్యంలో వన్యప్రాణులను వేటాడొద్దని వాటి కోసం పెట్టిన విద్యుత్ తీగలకు తగిలి అమాయక రైతులు చనిపోతున్నారని అవగహన కల్పిస్తున్న వేటగాళ్ళు మాత్రం తమ పద్దతి మార్చుకోవడం లేదని తెలిపారు. ఇప్పటికైనా వేట గాళ్ల పై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

క్రీడలతో శారీరక, మానసిక దృఢత్వం

- ఆసిఫాబాద్ ఎస్పీ సురేష్ కుమార్
- సిబ్బందికి క్రీడా సామాగ్రి పంపిణీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

పోలీస్ సిబ్బందిని క్రీడలు శారీరకంగా మానసికంగా దృఢంగా చేస్తాయనిఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. జిల్లా స్పెషల్ పార్టీ పోలీస్ సిబ్బందికి స్పోర్ట్స్ కిట్స్ అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ సిబ్బంది ఎల్లప్పుడు శారీరకంగా, మానసికంగా దఢంగా ఉండేందుకు క్రీడలు ఎంతో ముఖ్యమన్నారు. అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ, విరామకాల సమయాల్లో క్రీడలకు సమయం కేటాయించాలన్నారు. రాష్ట్రస్థాయిలో జరిగే పోలీస్ స్పోర్ట్స్ మీట్‌లో మన జిల్లాకు పథకాలు తీసుకురావడానికి, మెరుగైన ప్రతిభ కనబరుచుటకు స్పోర్ట్స్ కిట్లను ఉపయోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, టాస్క్ ఫోర్స్, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని జిల్లా ఎస్పీ సురేష్ కుమార్ అన్నారు. తాజా బదిలీల్లో భాగంగా జిల్లా పోలీస్ కార్యాలయంలో సీసీఎస్ ఇన్స్‌పెక్టర్ విధులు నిర్వహించిన ముత్యంరాజు బదిలీపై సిద్దిపేటకు వెళుతున్న నేపథ్యంలో ఆయనను సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని, అయితే పని చేసిన చోట ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునేలా ఉండాలన్నారు. ఫ్రెండ్లీ పోలీసింగ్ వ్యవస్థతో పోలీసులకు గుర్తింపు వస్తుందన్నారు. ముత్యం రాజు సీసీఎస్ విభాగంలో ఎంతో బాగా పనిచేశారని కితాబునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, టాస్క్ ఫోర్స్ స్పెషల్ బ్రాంచ్ ఇన్స్‌పెక్టర్ రాణా ప్రతాప్, ఆసిఫాబాద్ సీఐ సతీష్, డీపీఓ ఏఓ శ్రీనివాస్, ఫింగర్ ప్రింట్ విభాగం సీఐ మార్కండేయ, ఆర్ఐ అడ్మిన్ పెద్దన్న, ఆర్ఐ ఎంటీఓ అంజన్న, ఎస్‌బీఎస్ఐలు రామకృష్ణ, వెంకటేష్, ఆసిఫాబాద్ ఎస్ఐ మహేందర్, ఆర్ఎస్ఐలు ఓదెలు, కిరణ్ పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కాడే హేమంత్
- సొసైటీ గ్రంథాలయం ప్రారంభం



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిరుద్యోగులు గ్రంథాలయాలను ఉపయోగించుకొని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని కలెక్టర్ బొర్కాడే హేమంత్ అన్నారు. జిల్లా కేంద్రంలో నక్క వెంకటమ్మ యాదవ్, నక్క యాదగిరి స్వామి యాదవ్ ఎడ్యుకేషన్ అండ్ స్పోర్ట్స్ ఫౌండేషన్ నిర్వాహకులు నక్క ఉమేష్ కుమార్ యాదవ్, నక్క శ్రీనివాస యాదవ్‌ల సహకారంతో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే కోవలక్ష్మి, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వరరావు, ఎంపీపీ మల్లికార్జున్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన గ్రంథాలయాన్ని నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. దాతలు హైదరాబాద్‌లో ఉన్నప్పటికీ స్థానిక జిల్లాను మర్చిపోకపోవడం సంతోషంగా ఉందని తెలిపారు. ఎమ్మెల్యే కోవలక్ష్మి మాట్లాడుతూ జిల్లాలోని నిరుద్యోగుల సౌకర్యార్థం ప్రభుత్వ ఆధ్వర్యంలోనే కాకుండా వివిధ రకాల సేవ సంస్థలు కూడా గ్రంథాలయాలు ప్రారంభించాలని అన్నారు. అలాగే వాటిని ఉపయోగించుకుని జిల్లాకు మంచి పేరు తీసుకురావాలన్నారు. గ్రంథాలయ ప్రారంభానికి కృషిచేసిన జడ్పీటీసీని అభినందించారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
4
మంచిర్యాల
శుక్రవారం | ఫిబ్రవరి 23, 2024 | www.navatelangana.com

బస్సు డ్రైవర్, కండక్టర్లకు భోజన సదుపాయం

నవతెలంగాణ-నస్పూర్



మేడారం సమ్మక్క సారలమ్మ జాతర సందర్భంగా నస్పూర్ పట్టణంలోని శ్రీరాంపూర్ కాలని నుంచి మేడారం జాతరకు వెళ్లే స్పెషల్ బస్సు డ్రైవర్, కండక్టర్లకు కొక్కిరాల రఘుపతి రావు చారిటబుల్ ట్రస్ట్ ద్వారా గురువారం భోజన వసతిని కల్పించారు. మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్ రావు, డీసీసీ అధ్యక్షురాలు సురేఖ ఆదేశాల మేరకు భోజనాన్ని అందించినట్లు కాంగ్రెస్ నాయకులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 6వ వార్డు కౌన్సిలర్ పూదరి కుమార్, నస్పూర్ పట్టణ యూత్ అధ్యక్షుడు నరిగె నరేష్, కాంగ్రెస్ నాయకులు భీమిని రాజేష్ పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్‌ను సన్మానించిన మహిళలు

నవతెలంగాణ-జైపూర్



మండలంలోని షెట్‌పల్లిగ్రామ పంచాయతి మాజీ సర్పంచ్ మేడి రవిని మహిళా సంఘాల సభ్యులు సన్మానించారు. గురువారం గ్రామ పంచాయతీ కార్యాలయం ఆవరణలో శాలువాలతో సన్మానించి అభినందనలు తెలిపారు. గ్రామ పంచాయతి సర్పంచ్ పదవీ కాలంలో మహిళా సంఘాల అభ్యున్నతికి సహాయ సహకారం అందించిన తీరును గుర్తు చేసుకున్నారు.

కూలీల హాజరు శాతం పెరగాలి

- ఎంపీడీఓ గుర్రం సత్యనారాయణ



నవతెలంగాణ-జైపూర్

ఉపాధి హామీ పనుల నిర్వాహణలో పాల్గొనే కూలీల రోజువారి హాజరు శాతం పెంచుకోవాలని మండల పరిషత్ అభివృద్ధి అధికారి గుర్రం సత్యనారాయణ గౌడ్ సూచించారు. మండలంలోని కానుకూరు గ్రామ శివారు రక్షిత అటవీ ప్రాంతంలో తవ్వుతున్న కందకాలను ఏపీఓ వెంకటేశ్వర్లుతో కలిసి పరిశీలించారు. కూలీ గిట్టుబాటు కావాలంటే నిర్దేషిత కొలతలతో పనులు నిర్వహించాలని సూచించారు. వేసవి ఎండలు పెరుగుతున్నందున సమయపాలన పాటించాలని తెలిపారు.ఉపాధి హామీ పనుల నిర్వాహణ తీరును ఏపీఓతో కలిసి సమీక్షించారు. కూలీలకు గిట్టుబాటు అయ్యేవిధంగా పనుల నిర్వాహణ కొనసాగిచాలని అన్నారు. అదేవిధంగా గ్రామ పంచాయతీల వారిగా జాబ్ కార్డు ఉన్న ప్రతి ఒక్కరు ఉపాధి హామీ పనుల్లో పాల్గొనేవిధంగా చూడాలని తెలిపారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

పట్టణంలోని స్థానిక మల్లికార్జున నగర్ గుడిసె కొమురయ్య ఇల్లు బుధవారం సాయంత్రం శాట్ సర్క్యూట్ వలన ఇల్లు దగ్ధంమయింది. ఇల్లు పూర్తిగా దగ్ధం కావడంతో గురువారం పట్టణ కాంగ్రెస్ నాయకులు బాధిత ఇంటిని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి కుటుంబానికి కాంగ్రెస్ ఆధ్వర్యంలో రూ.5000 ఆర్థిక సాయంతో పాటు రూ.5000 నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు పల్లె రాజు, టీపీసీసీ కార్యదర్శి పిన్నంటి రఘునాథ్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపతి రాజయ్య, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ జంగం కళ, ఏర్రం విద్యాసాగర్, సీనియర్ నాయకులు అబ్దుల్ అజీజ్, కౌన్సిలర్స్ పొలం సత్యం, బింగి శివకిరణ్, ఎర్రబెల్లి రాజేష్, కట్లా రమేష్, నాయకులు ఒడ్నాల శ్రీనివాస్, మహంకాళి శ్రీనివాస్, బత్తుల వేణు, అర్నే సతీష్ పాల్గొన్నారు.

కలప అక్రమంగా తరలిస్తున్న కారు పట్టివేత



నవతెలంగాణ-జన్నారం

మండలంలోని కవ్వాల్ సెక్షన్ పరిధిలో, కలప అక్రమంగా తరలిస్తున్న కారును పట్టుకొని జన్నారం రేంజికి తరలించినట్లు ఎఫ్ఆర్ఓ ఆఫీస్ ఉద్దీన్ తెలిపారు. కామన్ పల్లి గ్రామ సమీపాన ఉన్న కడెం కెనాల్ ప్రధాన రహదారిపై ఏపీ 10 బీఏ 4242, నెంబర్ గల కారు కవ్వాల్ సెక్షన్ అధికారులకు అనుమానాస్పదంగా కనిపించడంతో ఆ కారును వెంబడించి తనిఖీలు చేయగా, ఆ కారులో ఆరు టేకు దుంగలు ఉన్నాయన్నారు. ఆరు టేకు దొంగలతో సహా ఆ కారును జన్నారం రేంజ్ కార్యాలయానికి తరలించినట్లు ఎఫ్ఆర్ఓ ఆఫీస్ ఉద్దీన్ తెలిపారు. పట్టుకున్న ఆరు టేకు దుంగల విలువ రూ.37000 ఉంటుందన్నారు. అక్రమంగా కలప రవాణా చేసిన వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తప్పవని, హెచ్చరించారు.

సమ్మక్క గద్దెలను దర్శించుకున్న డీసీసీ అధ్యక్షురాలు



నవతెలంగాణ-హాజీపూర్

మండలంలోని సబ్బేపల్లి శివారులో బుగ్గ గట్టు వద్ద నూతనంగా ఏర్పాటు చేసిన సమ్మక్క జాతరలో డీసీసీ అధ్యక్షురాలు కొక్కీరాల సురేఖ పాల్గొన్నారు. బుధవారం సమ్మక్క, సారక్క గద్దెలను దర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పుస్కూరి శిల్పా, ఆలయ కమిటీ చైర్మన్ శ్రీనివాస్‌రావు, జడ్పీ కో ఆప్షన్ నయీం పాషా, బొడ్డు శంకర్, రాజ మౌళి, కుటుంబ రావు, భుమన్న పాల్గొన్నారు.

ఇల్లు అమ్మి చదివిస్తే డీఎస్పీ అయ్యాను

- ఖాకీ యూనిఫాంను గౌరవించాలి
- రామగుండం సీపీ శ్రీనివాసులు



నవతెలంగాణ-హాజీపూర్

తన తల్లితండ్రులు ఇల్లు అమ్మి నన్ను చదివించి డీఎస్పీని చేశారని రామగుండం సీపీ శ్రీనివాసులు అన్నారు. గురువారం గుడిపేట్-13వ బెటాలియన్‌లో ఇటీవల కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన ఏ ఆర్ కానిస్టేబుల్స్‌కు 9 నెలల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ తన చిన్న తనంలో కలెక్టర్‌ను కలుద్దామని అమ్మతో కలిసి పోతే నెట్టివేశారు. అదే స్ఫూర్తితో తన తల్లి ఎలాగైనా కలెక్టర్ కావాలని చదించిందని అన్నారు. రెండు సార్లు ప్రయత్నం చేసిన కానీ ప్రిలిమ్స్, మెయిన్స్ క్వాలిఫై అయి కూడా ఇంటర్వ్యూలో వెనుదిరిగానని అన్నారు. అప్పటికే 8ఏండ్లు గడచింది కానీ కలెక్టర్‌ను కాలేక పోయనన్నారు. చదువుకు డబ్బులు లేకపోవడంతో తల్లి తండ్రులు ఇల్లు అమ్మి చదివిస్తే డీఎస్పీని అయ్యనని భవోద్వేగానికి లోనయ్యారు. ఇపుడు ఈ హోదాకు చేరుకున్నానన్నరు. కష్టపడి చదివితే ఉద్యోగం తప్పకుండా వస్తుందన్నారు. సమాజానికి సేవ చేయడానికే మీకు పోలీస్ ఉద్యోగం వచ్చిందన్నారు. 9 నెలల శిక్షణా సమయంలో ఎలాంటి రిమార్క్‌లు లేకుండా క్రమశిక్షణతో మెలగాలన్నారు. ఖాకీ యూనిఫాంను గౌరవిస్తూ శిక్షణను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. 13వ బెటాలియన్ కమాండెంట్ జమీల్ బాషా మాట్లాడుతూ శిక్షణలో బాగంగా 331 మంది ఏ ఆర్ కానిస్టేబుల్స్ రావాల్సి ఉండగా 241 మంది వచ్చారని తెలిపారు. ఈ నెల 29 వరకు మిగితా వారు చేరెందుకు అవకాశం ఉందన్నారు. శిక్షణా కానిస్టేబుళ్లకు సీపీ చేతుల మీదుగా మెటీరియల్స్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల ఏసీపీ రత్నపురం ప్రకాష్, అసిస్టెంట్ కమాండెంట్ రఘునాథ్ చౌహాన్, రూరల్ సీఐ ఆకుల అశోక్, అర్ఐలు బెటాలియన్ సిబ్బంది పాల్గొన్నారు.



సింగరేణి భూముల్లో మట్టి తవ్వకాలు నియంత్రించాలి

నవతెలంగాణ-జైపూర్



ఇందారం ఓపన్ కాస్ట్ గని ఆవసరాలకు సింగరేణి యాజమాన్యం రైతుల నుంచి సేకరించిన భూముల్లో అక్రమంగా మట్టి తవ్వకాలను నియంత్రించాలని మండల కాంగ్రెస్ నాయకులు డిమాండ్ చేస్తున్నారు. ఇందారం, రామారావుపేట్ శివారుల్లో గల సింగరేణి సంస్థకు చెందిన భూముల్లో చేపట్టిన అక్రమ తవ్వకాలను గురువారం మైనింగ్ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్, స్థానిక రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ తరుపతి, సింగరేణి విజిలెన్స్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ రామారావుపేట్, ఇందారం శివారుల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్న రైస్ మిల్ అభివృద్ధి కోసం దాని యజమాని తాటిపల్లి శ్రీనివాస్ సింగరేణి భూముల నుండి మట్టిని అక్రమంగా తరలిస్తున్నాడని ఆరోపించారు. మట్టి తవ్వకాల కోసం ఏకంగా రెండు జేసీబీలు, 10 లారీలను వినియోగించి ఇప్పటి వరకు 2 వేల ట్రిప్పుల మట్టిని తరలించారని ఆరోపించారు. మట్టిని తరలించేందకు ముందస్తుగా జిల్లా మైనింగ్ శాఖ, రెవెన్యూ శాఖ అధికారులతో పాటు సింగరేణి పీఓ శ్రీనివాస్‌రావు వంటి అధికారులతో రహస్య ఒప్పందాలు చేసుకున్నట్లు తెలిసిందన్నారు. అక్రమ మట్టి తవ్వకాలకు పాల్పడిన తాటిపల్లి శ్రీనివాస్ గతంలో బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ అనుచరుడిగా అనేక అక్రమాలకు పాల్పడినట్లు ఆరోపనలు ఉన్నాయని పేర్కొంటూ ప్రస్తుత ఎమ్మెల్యే గడ్డం వివేక్ వెంకటస్వామి పేరును వాడుకుంటూ అక్రమాలకు పాల్పడుతున్నట్లు చెప్పారు. ప్రస్తుత కాంగ్రెస్ ఎమ్మెల్యే వివేక్ వెంకటస్వామి అక్రమాలకు తావివ్వడని ఆయన పేరుతో ఎవరైనా తప్పుదోవపట్టించాలని ప్రయత్నిస్తే అధికారులు నమ్మవద్దని వెల్లడించారు. అదేవిధంగా వివేక్ వెంకటస్వామి పేరుతో ఎవరైనా మోసాలకు పాల్పడితే సహించేది లేదని ఈ సంధర్భంగా హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహ్మద్ ఫయాజోద్దీన్, ఇందారం మాజీ ఎంపీటీసీ సుంకరి శ్రీనివాస్, నాయకులు రాకేష్, షరీఫ్ పాల్గొన్నారు.

25న టీఆర్‌వీ రాష్ట్ర మహాసభలకు తరలిరండి



కరపత్రాలను విడుదల చేస్తున్న తెలంగాణ రచయితల వేదిక నాయకులు

నవతెలంగాణ-నస్పూర్

హైదరాబాద్ బషీర్బాగ్ ప్రెస్ క్లబ్‌లో ఫిబ్రవరి 25న జరగనున్న తెలంగాణ రచయితల వేదిక 8వ రాష్ట్ర మహాసభలకు జిల్లా లోని కవులు, రచయితలు, సాహిత్య అభిమానులు అధిక సంఖ్యలో తరలిరావాలని టీఆర్‌వీ ప్రతినిధులు పిలుపునిచ్చారు. జిల్లా శాఖ ఆధ్వర్యంలో గురువారం మహాసభల కరపత్రాలను గోడ ప్రతులను స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రచయితల వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోపగాని రవీందర్, తోటపల్లి భూమన్న, జిల్లా అధ్యక్షుడు తోకల రాజేశాంలు మాట్లాడుతూ తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమంలో టీఆర్‌వీ గణనీయమైన పాత్ర నిర్వహించిందని అన్నారు. ఉద్యమ సమయంలో వేలాది మంది కవులు, కళాకారులను అక్షరసైన్యంగా పల్లె పల్లెలో ఆకాంక్షను ప్రతిధ్వనించేలా పనిచేసిందని గుర్తు చేశారు. మొదటి నుండి తెలంగాణ భాష, ఆత్మ గౌరవం కోసం కంకణం కట్టుకున్నదని, ఈ క్రమంలో వర్తమాన కాలంలో కవులు, రచయితల పాత్రపై రాష్ట్ర మహాసభలు నిర్వహిస్తున్నదని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి ముత్యం నాగవర్మ, కార్యదర్శులు శ్రీమాన్, నూతన్ పాల్గొన్నారు.

ఘనంగా బెడెన్ పావెల్ జయంతి వేడుకలు

నవతెలంగాణ-మందమర్రి



స్కౌట్స్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు బెడెన్ పొవెల్ జయంతి వేడుకలను గురువారం సింగరేణి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. సింగరేణి ఉన్నత పాఠశాలలో స్కౌట్స్ అండ్ గైడ్స్‌ను స్థాపించిన బెడెన్ పొవెల్ జయంతిని పురస్కరించుకొని ప్రపంచ ఆలోచన దినోత్సవాన్ని గురువారం ఏరియా జీఎం మనోహర్ బెడెన్ పొవెల్ చిత్రపటానికి పూలమాలవేసి సర్వమత ప్రార్థనలు చేసి జెండా ఆవిష్కరించారు. జీఎం మాట్లాడుతూ స్కౌట్ అండ్ గైడ్ వ్యవస్థాపకుడు బెడెన్ పొవెల్ జయంతి సందర్భంగా ప్రపంచ వ్యాప్తంగా ఫిబ్రవరి 22న ఆలోచన దినోత్సవం జరుపుకుంటారని తెలిపారు. సాహసమే ఊపిరిగా సేవే పరమావధిగా మనమందరం కలిసి ప్రపంచాన్ని మారుద్దాం అనే సందేశాన్ని ఇచ్చారని, పిల్లలలో అపార శక్తి ఉందని గ్రహించి చిన్నప్పటి నుండే వారిలో దేశభక్తిని సేవా భావాన్ని పెంపొందించ గలిగితే మెరుగైన సమాజాన్ని నిర్మించవచ్చని విశ్వసించారని దీని వల్లనే స్కౌట్ అండ్ గైడ్స్‌ని స్థాపించారని అన్నారు. విద్యార్థి దశలో క్రమశిక్షణ దేశభక్తి పెంపొందించుకునేందుకు విద్యార్థులంతా స్కౌట్స్ అండ్ గైడ్స్‌లో శిక్షణ పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ ఎస్ శ్యామ్ సుందర్ పర్సనల్ మేనేజర్, ప్రధానోపాధ్యాయులు జె పురుషోత్తం, స్కౌట్ మాస్టర్ శక్తి కుమార్, గైడ్స్ మాస్టర్ కల్పలత పాల్గొన్నారు.

భూసారం ఆధారంగా ఎరువుల యాజమాన్యం పాటించాలి

- వ్యవసాయ విశ్వవిద్యాలయం విద్యార్థి ముత్యం తిరుపతి



నవతెలంగాణ-జైపూర్

పంటల సాగులో అనవసరమైన ఖర్చులు తగ్గించుకోవడంతో పాటు విరివిరిగా ఎరువులను వినియోగించకుండా భూసారం ఆధారంగా అవసరమైన ఎరువులు మాత్రమే వేసుకోవాలని జగిత్యాల జిల్లా పొలాస వ్యవసాయ కళాశాల మూడవ సంవత్సరం విద్యార్థి ముత్యం తిరుపతి సూచించారు. కృషి, అనుభవం కార్యక్రమంలో భాగంగా గురువారం గంగపల్లి శివారులో గల నరెడ్ల తిరుపతి, పాలమాకుల సుదర్శన్ వ్యవసాయ క్షేత్రాల్లోని మట్టి నమూనాలు సేకరించారు. ఈ సంధర్భంగా మాట్లాడుతూ ప్రతి రైతు తమ పంట పొలాల్లోని మట్టిని ప్రతి మూడు పంటలకు ఒక సారి పరీక్షించుకోవడం ద్వార వచ్చే ఫలితాల ఆధారంగా ఎరువులు వినియోగించుకోవాలని తెలిపారు. భూసార పరీక్ష ద్వార భూమిలో గల నత్రజని, భాస్వరం, పోటాష్‌తో పాటు సూక్ష్మ పోషకాల లభ్యతతో పాటు ఉదజని సూచిక, లవణ సాంద్రత, సేంద్రియ కర్బన శాతం తెలియవస్తోందని తెలిపారు. దీని ఆధారంగా పంటలు సాగు చేస్తున్న సమయంలో అవసరానికి అనుగుణంగా ఎరువులు వాడుకోవడం ద్వార పెట్టుబడి వ్యయం తగ్గుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల కృషి అనుభవ కార్యక్రమ విద్యార్థులు వివేక్, శ్రీవాత్సవ్, రాంప్రసాద్, హర్షిత్ పాల్గొన్నారు.

భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేయాలి

- జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు



నవతెలంగాణ-జైపూర్

మహా శివరాత్రిని పురస్కరించుకుని వేలాల మల్లన్న జాతరకు వచ్చే భక్తుల సౌకర్యార్థం ఏర్పాట్లు పూర్తి చేయాలని జైపూర్ ఏసీపీ వెంకటేశ్వర్లు సూచించారు. స్థానిక ఎస్సై ఉపేందర్ రావుతో కలిసి గురువారం వేలాల మల్లిఖార్జున స్వామి ఆలయంతో పాటు గుట్టపై వెలిసిన గట్టు మల్లన్నను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా జాతర ఏర్పాట్లు, వసతీ కల్పన తదితర విషయాలను అడిగి తెల్సుకున్న ఆయన భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలుగకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. మహా శివరాత్రి రోజు గట్టు మల్లన్న సన్నిధిలో నిర్వహించు జాతరలో పాల్గొనే భక్తులు గుట్టపై విడిది చేసే ప్రదేశాలను పరిశీలించారు. అదేవిధంగా వేలాల గ్రామంలో వెలిసిన మల్లిఖార్జున స్వామి జాతరలో పాల్గొనే భక్తుల విడిది ప్రదేశాలు, వాహణాల పార్కింగ్ ఏరియాను పరిశీలించారు. ఈ సంధర్భంగా స్థానిక నాయకులు ఏసీపీ వెంకటేశ్వర్లుతో పాటు ఎస్సై ఉపేందర్ రావును శాలువాలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతి ప్రత్యేక అధికారి విద్యాసాగర్, చొప్పకట్ల శ్రీకాంత్, మాజీ ఉప సర్పంచ్ డేగ నగేష్, గ్రామ పంచాయతి కార్యదర్శి రాకేష్, నాయకులు తిరుపతి గౌడ్, రాజేష్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ నస్పూర్ అధ్యక్షుడిగా కొంకట మహేందర్



నవతెలంగాణ-నస్పూర్

మాదిగ రిజర్వేషన్ పోరాట సమితి నస్పూర్ అధ్యక్షుడిగా కొంకట మహేందర్ ను నియమించారు. గురువారం మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు కొంకట రవీందర్ ఆధ్వర్యంలో నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మార్పీఎస్ నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగిందని, ఎన్నికైన వారు మాదిగల హక్కులు సాధించడంలో కీలక పాత్ర పోషించాలన్నారు.

ఆర్థిక ఇబ్బందులతో వ్యక్తి ఆత్మహత్య

నవతెలంగాణ-హాజీపూర్



వేంపల్లి సబ్‌స్టేషన్‌లో ఆపరేటర్‌గా పనిచేసే విజ్జగిరి సమ్మయ్య(51) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. హజీపూర్ ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం.. సమ్మయ్య ఆర్థిక ఇబ్బందులతో తాను పనిచేసే సబ్‌స్టేషన్‌లోనే ఈ నెల 20న గడ్డి మందు తాగి ఆత్మహత్యకు ప్రయత్నించాడు. చికిత్స కోసం ఆస్పత్రికి తరలించగా బుధవారం రాత్రి మృతి చెందాడు. కుమారుడు రోహిత్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై తెలిపారు.

నవతెలంగాణ
మనుషి తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శుక్రవారం | ఫిబ్రవరి 23, 2024 | www.navatelangana.com

గద్దెపై కొలువుదీరిన సమ్మక్క

నవతెలంగాణ- రామకృష్ణాపూర్



ఆర్కే1ఏ గని పాలవాగు సమీపంలో నిర్వహించే సమ్మక్క సారలమ్మ జాతరలో భాగంగా గురువారం గద్దెపై సమ్మక్క కొలువుతీరారు. అమ్మవారికి గిరిజన పూజారులు పూజలు నిర్వహించి, మేళతాళాలతో నృత్యాలు చేస్తూ అమ్మవారిని గద్దెకు చేర్చారు.సమ్మక్క రాకతో భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో మందమర్రి జీఎం మనోహర్,యూనియన్ నాయకులు, వివిధ పార్టీ నాయకులు, సింగరేణి ఉన్నత అధికారులు, భక్తులు పాల్గొన్నారు.

వనదేవతలను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

నవతెలంగాణ- ఆసిఫాబాద్



జిల్లా కేంద్రంలోని కేస్లాపూర్‌లో సమ్మక్క సారలమ్మ గద్దెల వద్ద వన దేవతలకు మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సమ్మక్క సారలమ్మలు ప్రజలను చల్లగా చూడాలని కోరుకున్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు ప్రణయ్, నాగరాజు, గడ్డల ప్రణయ్ పాల్గొన్నారు.

గడ్పూర్ రోడ్డులో అడవి దున్న



నవతెలంగాణ - హాజీపూర్

మండలంలోని ర్యాలీ గడ్పూర్‌లో గురువారం అడవి దున్న రోడ్డు దాటుతూ కనబడింది. మంచిర్యాల నుండి గడ్పూర్ వెళ్లే వాహనదారులు గమనించి ఫొటోలు, వీడియోలు తీశారు. వయస్సు ఎక్కువ ఉన్న దున్న నెమ్మదిగా రోడ్డు దాటుతూ కాసేపు అక్కడే ఆగడంతో వాహనదారులు సెల్ ఫోన్లలో బంధించారు.

బోర్‌వెల్ నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ- రెబ్బెన

రెబ్బెన పంచాయతీ పరిధిలోని సింగల్‌గూడ గ్రామంలో సేవాలాల్ ఆలయం వద్ద బోర్‌వెల్ నిర్మాణానికి గురువారం కాంగ్రెస్ నాయకులు భూమి పూజ చేశారు.అనంతరం వారు మాట్లాడుతూ గ్రామస్థులు, భక్తుల కోరిక మేరకు ఈ బోర్‌వెల్ ప్రారంభించినట్లు తెలిపారు. ప్రజలందరికీ సంక్షేమం, అభివృద్ధికి ఫలాలు అందించడమే కాంగ్రెస్ ప్రభుత్వం లక్ష్యమని పేర్కొన్నారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు లావుడ్యా రమేష్,సీనియర్ కాంగ్రెస్ నాయకులు మోడెం సుదర్శన్ గౌడ్, మోడెం చిరంజీవి గౌడ్,గోగర్ల రాజేష్,మైనార్టీ మండల అధ్యక్షుడు ఇంరోజ్, అజ్మీరా అశోక్, జమ్మి భాయ్,లావుడ్యా కిషన్,లాల్ సింగ్ పాల్గొన్నారు.

విగ్రహాలను ధ్వంసం చేసిన వారిని శిక్షించాలి



నవతెలంగాణ - చింతలమానేపల్లి

మంచిర్యాల జిల్లా కోటపల్లి మండలం బోరంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన మహాత్మా జ్యోతి బాపులే, సావిత్రిబాయి పూలే విగ్రహాలను ధ్వంసం చేయడాన్ని ఖండిస్తూ మాలి సంఘం ఆధ్వర్యంలో నిరసనలు చేపట్టారు. మండలంలోని డబ్బాఎక్స్ రోడ్ వద్ద చేపట్టిన ఈ నిరసనలో సంఘం మండల అధ్యక్షులు నికోడే బాపురావు మాట్లాడారు. జ్యోతిబాపూలే, సావిత్రిబాయి పూలే విగ్రహాలు ధ్వంసం చేసిన వారిని త్వరలోనే పట్టుకొని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. నిందితున్ని ప్రోత్సహించిన వారిని కూడా గుర్తించి శిక్షించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో శ్రీ శివరామ యూత్ అధ్యక్షుడు గుర్లే శ్రీనివాస్, యువజన విభాగం అధ్యక్షులు వడాయి గణపతి, కావుడే కిరణ్ ధనుంజయ్, డొంగ్రే సంతోష్, వసంత్, తిరుపతి, బరిగల శంకర్, బొగ్గుల రమేష్, ఎద్దు ప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు.

సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న డీసీసీ అధ్యక్షురాలు



నవతెలంగాణ- నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముక్కిడి పోచమ్మ దేవాలయం దగ్గర కొలువైన సమ్మక్క, సారలమ్మను డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖ గురువారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆసియా ఖండంలోనే అతిపెద్ద గిరిజన జాతరైన వనదేవతల ఆశీర్వాదంతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసురిమిల్ల వేణు, 12వ వార్డు కౌన్సిలర్, నస్పూర్ పట్టణ మహిళా అధ్యక్షురాలు బొద్దున సంధ్యారాణి, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

హనుమాన్ దేవాలయ ప్రారంభోత్సవం

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండలంలోని నారాయణపూర్ గ్రామంలో దేవాదాయశాఖ 50లక్షల రూపాయలతో నిర్మించిన హనుమాన్ దేవాలయాన్ని గురువారం ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రారంభోత్సవం చేశారు. గత మూడు రోజుల నుంచి దేవాలయ ప్రతిష్ఠ కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అర్చకులు రఘురాం శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, హోమం నిర్వహించారు. ఉదయం గ్రామంలో హనుమాన్ చిత్రపటంతో ఊరేగింపు తీశారు. గ్రామస్తులకు కొమిరిశెట్టి తిరుపతి పటేల్ అన్నదానం చేశారు. ఆలయ నిర్మాణంలో సహకరించిన భక్తులకు శాలువాలతో గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సిరిసిల్ల నియోజకవర్గం ఇంచార్జీ కేకే మహేందర్‌రెడ్డి, ఎంపిపి పిల్లి రేణుక, ఎంపిడివో సత్తయ్య, వేములవాడ ఇఇ రాజేష్, ఎంపిటిసి ఆపేరా సుల్తానా, మాజీ సర్పంచ్‌లు నిమ్మ లక్ష్మి, దొమ్మాటి నర్సయ్య, మాజీ ఉపసర్పంచ్ మహేందర్, నాయకులు సూర నర్సయ్య, నిమ్మ సుధాకర్‌రెడ్డి, లింగాల నర్సయ్య, లదునూరి హనుమాండ్లు, శ్రీధర్, లక్ష్మారెడ్డిలు పాల్గొన్నారు.

ఎస్పీఎం యాజమాన్యాన్ని ఢిల్లీకి పిలిపిస్తాం

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి



కాగజ్‌నగర్‌లో మాట్లాడుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు జి కిషన్‌రెడ్డి

నవతెలంగాణ-కాగజ్‌నగర్

సిర్పూరు పేపర్ మిల్లు కార్మికుల సమస్యలపై ఆ మిల్లు యాజమాన్యాన్ని ఢిల్లీకి పిలిపించి మాట్లాడి సమస్యలు పరిష్కరిస్తామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర పర్యాటక శాఖ మంత్రి జి. కిషన్‌రెడ్డి అన్నారు. గురువారం కాగజ్‌నగర్‌లోని ఎస్పీఎం గేటు ముందున్న ప్రజా కార్యాలయంలో కార్మికులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ముందుగా మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు చిత్రపటానికి నివాళులు అర్పించారు. అనంతరం కిషన్‌రెడ్డి మాట్లాడుతూ కాంట్రాక్టు కార్మికులతో పాటు పర్మినెంట్ కార్మికుల పట్ల మిల్లు యాజమాన్యం వ్యతిరేక వైఖరి అవలంబిస్తోందని, కార్మికులకు న్యాయబద్దంగా, చట్టబద్దంగా రావాల్సిన హక్కుల కోసం పోరాటం చేయాల్సిందేనని అన్నారు. కార్మికుల సమస్యల పరిష్కారానికి భవిష్యత్తు కార్యాచరణ రూపొందిస్తామని అన్నారు. కేంద్రంలో మోడీ ప్రభుత్వం రాకముందు యుపీఏ హయాంలో అన్ని కుంభకోణాలేనని అన్నారు. నాడు కేంద్ర మంత్రులు, ఎంపీలు కూడా జైళ్లకు వెళ్లాల్సిన పరిస్థితులు వచ్చాయని గుర్తుచేశారు. గడిచిన తొమ్మిదిన్నరేళ్ల కాలంలో ఎలాంటి అవినీతి లేకుండా, పారదర్శక పాలన కొనసాగుతుందంటే దీనికి ప్రధాని మోడీనే కారణమని అన్నారు. అంతకుముందు ఆదిలాబాద్, సిర్పూరు (టి) ఎమ్మెల్యేలు పాయల శంకర్, పాల్వాయి హరీష్‌బాబు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సహకారంతోనే నాడు పేపర్ మిల్లు పున:ప్రారంభమైనదని అన్నారు. కేంద్ర ప్రభుత్వ ఆధీనంలో ఉన్న బ్యాంకింగ్ వ్యవస్థ సహకారంతోనే మిల్లు ప్రారంభమైందని, కాని దీనిని కప్పిపుచ్చి అప్పటి మంత్రి కేటీఆర్, ఎమ్మెల్యే కోనేరు కోనప్పలు కార్మికులను మభ్యపెట్టారని అన్నారు. మిల్లులో క్యాంటీన్ సౌకర్యం, విధుల్లోకి తీసుకోని 190 మంది కార్మికులను విధుల్లోకి తీసుకోవడం, గుర్తింపు సంఘం ఎన్నికలు జరపాలని తాము డిమాండ్ చేస్తున్నామని అన్నారు. బీఎంఎస్ రాష్ట్ర నాయకులు కల్లోల భట్టాచార్య, బీజేపీ ప్రభారి రాజమౌళిగౌడ్‌లు మాట్లాడారు. బీజేపీ పట్టణ అధ్యక్షులు సిందం శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో నాయకులు ఈర్ల విశ్వేశ్వర్‌రావు, దెబ్బటి శ్రీనివాస్, కొంగ సత్యనారాయణ, ధోని శ్రీశైలం, మోనీ, వీరభద్రచారి, జిలుకర పోచయ్య పాల్గొన్నారు.

వసతిగృహ విద్యార్థులకు మెరుగైన విద్యనందించండి

- ఐటీడీఏ పీఓ కుష్బు గుప్తా



నవతెలంగాణ-వాంకిడి

ఆశ్రమ పాఠశాలల విద్యార్థులకు మెరుగైన విద్యనందించాలని ఐటిడిఎ పిఓ కుష్బుగుప్తా ఉపాధ్యాయులను ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల, బంబారా పీహెచ్‌సీ, ఆసిఫాబాద్ క్రీడా ఆశ్రమ పాఠశాలలను పిఓ ఆకస్మికంగా సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న విద్య, వైద్యం, భోజనంపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా పిఓ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ప్రతిరోజూ మెనూ ప్రకారం పోషక విలువలు గల ఆహారాన్ని అందించాలన్నారు. సబ్జెక్టుల వారీగా విద్యార్థులకు అర్థమయ్యే రీతిలో విద్యాబోధన చేయాలన్నారు. వర్షాల నేపథ్యంలో దోమలతో వ్యాపించే డెంగ్యూ, మలేరియా వంటి వ్యాధులు ప్రబలకుండా, వసతిగృహ పరిసరాలలో వర్షపు నీరు నిలవకుండా నిత్యం పారిశుధ్య కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. ప్రతిరోజు వంటగది, స్టోర్ రూమ్, తాగునీరు, మరుగుదొడ్లు శుభ్రంగా ఉండేలా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు భోదించారు. సబ్జెక్టుల వారీగా ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. ప్రతి విద్యార్థికి చదవడం, రాయడం తప్పనిసరిగా రావాలని ఉపాధ్యాయులకు సూచించారు. ఈ కార్యక్రమాలలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందే

- బీజేపీ రాష్ట్ర నాయకుడు ఈటల రాజేందర్



నవతెలంగాణ-ఆసిఫాబాద్

కాంగ్రెస్, బీజేపీలు రెండు దొందు దొందే అని పార్లమెంట్ ఎన్నికల్లో మరోసారి బీజేపీని గెలిపించాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు చేరికల కమిటీ చైర్మన్ ఈటల రాజేందర్ అన్నారు. విజయ సంకల్ప యాత్రలో భాగంగా గురువారం జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌక్ వద్ద జిల్లా అధ్యక్షుడు కొత్తపెల్లి శ్రీనివాస్ అధ్యక్షతన ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దేశాన్ని ప్రపంచంలో గుర్తింపు వచ్చేలా తెచ్చిన ఘనత నరేంద్ర మోడీకి దక్కిందన్నారు. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేస్తే వృధా అవుతుందన్నారు. గత ప్రభుత్వ హయాంలో కేంద్ర ప్రభుత్వం చేసిన పథకాలను రాష్ట్ర ప్రభుత్వ పథకాలుగా ప్రచారం చేశారని ఆరోపించారు. దేశం ఘనత చందమామ వరకు చేరిందన్నారు. ఎన్నో రకాల చిక్కుల్లో ఉన్న అయోధ్య అంశాన్ని ఎటువంటి గొడవలు లేకుండా పరిష్కారం చేశామన్నారు. ప్రభుత్వం అంటే ప్రజల విశ్వాసం ఉండాలని అది నరేంద్ర మోడీ సాధించారన్నారు. పక్క దేశాలు ఆపదలో ఉంటే ఆదుకున్నట్లు తెలిపారు. ముస్లిం దేశాలలో కూడా నరేంద్ర మోడీకి బ్రహ్మరథం పడుతున్నారన్నారు. రానున్న పార్లమెంటు ఎన్నికల్లో 370కి పైగా సీట్ల సాధించడమే లక్ష్యం అన్నారు. గత ఎన్నికల్లో ఆదిలాబాద్ పార్లమెంటులో ఇచ్చిన తీర్పును ప్రజలు మరోసారి ఇవ్వాలని కోరారు. సబ్కా సాత్ సబ్కా వికాస్ పేరుతో ప్రజా సంక్షేమమే బీజేపీ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ సోయం బాపూరావు, నాయకులు రాథోడ్ రమేష్, కొట్నాక విజయ్, సతీష్ బాబు, చర్ల మురళీ పాల్గొన్నారు.

బెడెన్ పావెల్ 167వ జయంతి వేడుకలు

నవతెలంగాణ - గోదావరిఖని

స్కౌట్ అండ్ గైడ్స్ వ్యవస్థాపకులు బెడెన్ పావెల్ 167వ జయంతి వేడుకలు, వరల్డ్ థింకింగ్ డే వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఆర్‌సిఓఎ క్లబ్ ఎదురుగానున్న బెడెన్ పావెల్ పార్క్‌లో గల బెడెన్ పావెల్ విగ్రహానికి సింగరేణి ఆర్జీ 1 జిఎం చింతల శ్రీనివాస్ పూలమాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ప్రపంచ చరిత్రలో బెడెన్ పావెల్ ఒక నూతన ఒరవడిని స్థాపించి ప్రపంచ వ్యాప్తంగా నిస్వార్థ సేవలో ఎందరికో స్ఫూర్తి ప్రధాతగా నిలిచారని, దేశ సేవాలో ఒక సైనిక వ్యవస్థ వలే వీరి సేవలు మరువలేనివని కొనియాడారు. ఈ సందర్భంగా స్కౌట్ అండ్ గైడ్‌లకు శుభకాంక్షలు తెలిపారు. అనంతరం వివిధ పాఠశాల నుండి వచ్చిన 200 మంది స్కౌట్ అండ్ గైడ్స్‌లతో శాంతి ప్రగతి యాత్ర చేశారు. అనంతరం స్కౌటింగ్ గురించి వివిధ మెలుకువలను రెస్క్యూ టీం ఫస్ట్ ఎయిడ్ చికిత్స గురించి, ప్రాణప్రాయ పరిస్థితిలో తీసుకోవల్సిన చర్యల గురించి వివరించారు. స్కౌట్స్ అండ్ గైడ్స్‌కు వివిధ ఆటల పోటీలు, శిక్షణ తరగతులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎజిఎం పర్సనల్ సిహెచ్.లక్ష్మినారాయణ, సిఎంఒఎఐ ఉపాధ్యక్షుడు పెరుమాండ్ల శ్రీనివాస్, ఎఐటియుసి బ్రాంచి సెక్రటరి రంగు శ్రీనివాస్, ఎన్విరాన్ మెంట్ అధికారి ఆంజనేయ ప్రసాద్, సీనియర్ పిఓ బంగారు సారంగపాణి, జ్యోతి, లక్ష్మి కుమారి, స్వర్ణలత, వీరారెడ్డి, దుర్గాప్రసాద్, స్కౌట్ మాస్టర్స్ రామచందర్ రావు, యం.గట్టుమల్లు, ఎ.దేవేందర్, కె.బుచ్చయ్య కుమార్, సాంబయ్య సింగరేణి హైస్కూల్, శ్రీరామ విద్యానికేతన్ హైస్కూల్, సెయింట్ పాల్స్ హైస్కూల్ పాఠశాలల స్కౌట్ అండ్ గైడ్స్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎల్లారెడ్డిపేట గ్రామపంచాయతీని తనిఖీ చేసిన జిల్లా పంచాయతీ అధికారి

నవతెలంగాణ - ఎల్లారెడ్డిపేట

మండల కేంద్రంలోని మేజర్ గ్రామపంచాయతీ కార్యాల యాన్ని గురువారం జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య ఆకస్మికంగా తనిఖీ చేశారు. గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించారు. ఇంటి పన్నులు, వ్యాపార పన్నులను ఈ నెల చివరి వరకు చెల్లించేలా తగు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలోని సమస్యల కోసం ప్రజలతో మమేకమై విధులు నిర్వహించాలని ఆదేశించారు. ఆయనవెంట ఎంపీవో వజీర్ హైమద్, గ్రామపంచాయతీ ఈవో దేవరాజు, గ్రామపంచాయతీ సిబ్బంది ఉన్నారు.

నేడే పెద్దపల్లిలో మెజీషియన్స్ డే వేడుకలు

నవతెలంగాణ - గోదావరిఖని క్రైం

ప్రపంచ ప్రఖ్యాత భారతీయ ఇంద్రజాలికులు, పద్మశ్రీ పిసి సర్కార్(సీనియర్) జయంతిని పురస్కరించుకుని ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ప్రతియేటా ఒకచోట ఫిబ్రవరి 23న ఇంద్రజాలికుల దినోత్సవం ఘనంగా నిర్వహిస్తున్నామని కరీంనగర్ జిల్లా మెజీషియన్స్ అసోసియేషన్ గౌరవాధ్యక్షులు మేజిక్ రాజా, అధ్యక్ష, ప్రధానకార్యదర్శులు యస్.మల్లేశం, యతిరాజ్ కాస ఒక ప్రకటనలో తెలిపారు. అందులో భాగంగా ఈ సంవత్సరం పెద్దపల్లి రిక్రియేషన్ క్లబ్ సౌజన్యంతో జిల్లా కేంద్రంలోని అమర్ చంద్ కళ్యాణ మండపంలో వేడుకలు నిర్వహించనున్నట్లు వారు పేర్కొన్నారు. పలువురి ఇంద్రజాల ప్రదర్శనలతోపాటు సీనియర్ మెజీషియన్లకు సత్కారం చేయనున్నట్లు తెలిపారు. ఈ వేడుకలలో వరంగల్ జిల్లాకు చెందిన మెజీషియన్లు కూడా పలువురు హాజరుకానున్నారని, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఇంద్రజాలికులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు

నవతెలంగాణ- రెబ్బెన

కొమురం భీం ఆసిఫాబాద్ జిల్లా రెబ్బెన మండలంలోని గంగాపూర్ గ్రామంలో కొలువుదీరిన శ్రీ బాలాజీ వెంకటేశ్వరస్వామి జాతరకు పటిష్ట బందోబస్తు ఏర్పాటుచేసినట్లు జిల్లా ఎస్పీ కె.సురేష్‌కుమార్ అన్నారు. గురువారం ఆలయం వద్ద ఏర్పాట్లను పర్యవేక్షించి, ట్రాఫిక్ నియంత్రణకు సంబంధించి పలు సూచనలు చేశారు. స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. డీఎస్పీ, సీఐలు, ఎస్సైలతో పాటు 100మంది పోలీసు సిబ్బందిని నియమించినట్లు పేర్కొన్నారు. అనంతరం ఆలయ ఈఓ ఎస్పీని సన్మానించి తీర్థప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ కరుణాకర్, స్పెషల్ బ్రాంచ్ సీఐ రాణాప్రతాప్, రెబ్బెన సీఐ చిట్టి బాబు,ఆలయ ఈఓ బాపిరెడ్డి, ఆసిఫాబాద్ సీఐ సతీష్, వాంకిడి సీఐ శ్రీనివాస్, ఎస్ఐ చంద్రశేఖర్, తిర్యాణి ఎస్సై రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గద్దెపై కొలువుదీరిన సమ్మక్క



నవతెలంగాణ- నస్పూర్

నస్పూర్ మున్సిపాలిటీ పరిధిలోని ముక్కిడి పోచమ్మ ఆలయం వద్ద బుధవారం సారలమ్మ గద్దె పైకి రాగా, గురువారం సమ్మక్క గద్దెపై కొలువు తీరింది. శ్రీరాంపూర్ ఏరియా జీఎం సంజీవరెడ్డి-రాధాకుమారి దంపతులు సమ్మక్క దేవతను సింగరేణి ఉన్నత పాఠశాల నుండి డప్పు చప్పులతో భక్తుల కోలాహలం మధ్య కంకవణానికి పూజలు చేసి గద్దె వద్ద ప్రతిష్టించారు.అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా జీఎం మాట్లాడుతూ సింగరేణి ఏరియాలో నివసిస్తున్న ఉద్యోగులు, పుర ప్రజలందరినీ చల్లగా చూడాలని, వనదేవతల ఆశీస్సులు ఎల్లప్పుడూ ఉండాలని కోరారు.ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ బాజీ సైదా,ఎస్ఓ టు జీఎం కె. రఘుకుమార్ దంపతులు,డీజీఎం పర్సనల్ పి అరవిందరావు,డీజీఎం సివిల్ ఆనంద్ కుమార్, సీనియర్ సెక్యూరిటీ ఆఫీసర్ మురళిమోహన్, డీవై పీఎం సుదర్శన్, సీనియర్ పీవో పి. కాంతారావు, సీనియర్ ఐటి ప్రోగ్రామర్ శ్రీనివాస్, సీఎంఓ ఏఐ జనరల్ సెక్రటరీ చంద్రశేఖర్,ఆలయ పూజారి రమేష్, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

మహా నగరంగా తీర్చిదిద్దడానికి సహకరించాలి

నవతెలంగాణ - గోదావరిఖని

రామగుండం నగరాన్ని మహా నగరంగా తీర్చిదిద్దడానికి సహకరించాలని స్థానిక శాసన సభ్యులు ఎం ఎస్ రాజ్ ఠాకూర్ కోరారు. రామగుండం నగర పాలక సంస్థ కౌన్సిల్ హాల్‌లో గురువారం నిర్వహించిన బడ్జెట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ రాజకీయాలకు అతీతంగా ప్రజా ప్రతినిధులంతా సమష్టిగా, సమైక్యంగా నగరాభివృద్ధిపై దృష్టి సారించాలని అన్నారు. నగరాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయించే భాధ్యత తాను తీసుకుంటానని అన్నారు. మాంచెస్టర్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచిన రామగుండం నగరంలో గత కొంత కాలంగా ఓపెన్ కాస్ట్‌లతో , మూత పడిన పరిశ్రమలతో ఉద్యోగాలు దొరక్క జనాభా తగ్గుతోందని అన్నారు. ఎన్‌టిపిసిలో కొత్త ప్లాంట్‌ల ఏర్పాటు, జెన్ కో ప్లాంట్ పునరుద్ధరణతోపాటు ఇంకా కొత్త పరిశ్రమలు ఏర్పాటు చేయించి నగరానికి పూర్వ వైభవం తీసుకువచ్చేందుకు ప్రయత్నం చేస్తున్నానని అన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాలలో రామగుండం సమస్యలు అనేకం ప్రస్తావించానని అన్నారు. జిల్లా మంత్రి శ్రీధర్ బాబు, ఇన్‌చార్జ్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క , ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిల సహకారంతో రామగుండం నగరానికి అవసరమైన నిధులు మంజూరు చేయించి సంపూర్ణంగా అభివృద్ధి చేయడానికి శాయ శక్తులా కృషి చేస్తున్నానని అన్నారు. స్థానిక ప్రభుత్వ రంగ సంస్థల సిఎస్ఆర్ నిధులు కూడా గతంలో లాగా ఇతర ప్రాంతాలకు తరలి పోకుండా రామగుండం నియోజక వర్గ అభివృద్ధికి వెచ్చించేలా చేస్తానని అన్నారు. అలాగే స్థానిక పరిశ్రమల ద్వారా ఒక మిలియన్ చెట్లు పెంచేలా చర్యలు తీసుకొని కాలుష్యం తగ్గించే దిశగా కృషి చేస్తానన్నారు. నగర ప్రధాన వ్యాపార కేంద్రమైన లక్ష్మీ నగర్‌ను సంపూర్ణంగా అభివృద్ధి చేసి ప్రముఖ వాణిజ్య ప్రాంతంగా తీర్చిదిద్దుతామన్నారు. మొదటి విడతగా డిఎంఎఫ్‌టి నిధులు రూ.10 కోట్లు లక్ష్మీ నగర్ అభివృద్ధికే కేటాయించడం జరిగిందన్నారు. మరో రూ.29కోట్లతో నియోజక వర్గంలో వివిధ అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. టియుఎఫ్ఐడిసి రూ.100 కోట్లు, అమృత్ 250 కోట్లతో నగరంలో రోడ్లు , కాలువల నిర్మాణంతో పాటు గోదావరిలో మురుగు నీరు చేరకుండా ఎస్‌టిపి నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజారోగ్యం దృష్టిలో ఉంచుకొని బడ్జెట్‌లో పారిశుద్ధ్య నిర్వహణకు మరిన్ని ఎక్కువ నిధులు కేటాయించి ప్రాధాన్యత ఇవ్వాలని అన్నారు. పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచే పారిశుద్ధ్య పని వారికి అవసరమైన రక్షణ వస్తువులు, పని ముట్లు ఇవ్వాలని అన్నారు. రోడ్‌లపై పశువులు తిరగకుండా అరికట్టాలని అన్నారు. నగరాన్ని ఆదర్శ నగరంగా తీర్చిదిద్దడంలో పరస్పర సహకారం అవసరమని రామగుండం నగర మేయర్ బంగి అనిల్ కుమార్ అన్నారు. బడ్జెట్ ప్రసంగంలో భాగంగా ఆయన మాట్లాడుతూ ప్రతిపాదించిన అభివృద్ధి పనులన్నీ త్వరితగతిన పూర్తి చేసేందుకు కార్పొరేటర్లు, అధికారులు సహకారం అందించాలని కోరారు. స్థానిక శాసన సభ్యులు, జిల్లా మంత్రి వర్యులు, జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) రామగుండం నగర అభివృద్ధికి సహకారం అందిస్తున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. నగర పాలక సంస్థపై ఆర్థిక భారం పడకుండా సింగరేణి తదితర సంస్థలతో సమ్మక్క సారలమ్మ జాతర ఏర్పాట్లు చేయించినందుకుఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. వాస్తవాలకు దగ్గరగా ఉండాలని, గతంలో కంటే బడ్జెట్ అంచనాలను కొద్దిగా తగ్గించినట్లు తెలిపారు. ఖర్చులకు తగినట్లుగా మున్సిపల్ ఆదాయం లేనందున నూతన ఆదాయ మార్గాలను సూచించాలని కోరారు. కొంతమంది రేకుల షెడ్‌లను పక్కా భవనాలుగా మార్చుకున్నా, పైఅంతస్తులు నిర్మించుకున్నప్పటికీ పన్ను మారలేదని దృష్టికి తెచ్చిన నేపథ్యంలో ఏప్రిల్ 1 తరువాత మున్సిపల్ రెవెన్యూ సిబ్బంది ఇంటింటికి వెళ్ళి సర్వే చేసి పన్ను మొత్తాలను పునఃసమీక్షించాలని కోరారు. రామగుండం నగరాన్ని అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులను మంజూరు చేయించడానికి ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ విశేష కృషి చేస్తున్నారన్నారు. డీఎంఎఫ్‌టీ, టీయూఎఫ్ఐడీసీ, అమృత్ నిధులతో డివిజన్‌లలో అభివృద్ధి పనులు పూర్తవుతే రామగుండం రూపు రేఖలు మారి పోతాయన్నారు. రామగుండం నగర పాలక సంస్థ కమిషనర్ సిహెచ్.శ్రీకాంత్ మాట్లాడుతూ శాసన సభ్యులు, మేయర్ ఆలోచనలకు అనుగుణంగా, పాలక వర్గ సభ్యుల సహకారంతో భాధ్యతగా పని చేస్తామని అన్నారు. అభివృద్ధికి సంబంధించి అందరితో చర్చించి ముందుకు వెళ్తామన్నారు. కాగా 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ.211 కోట్ల 22 లక్షల 27వేల అంచనా లతో రూపొందించిన బడ్జెట్‌కు సమావేశంలో ఏక గ్రీవంగా ఆమోదం తెలిపారు. అంచనా వ్యయం 196 కోట్ల 42 లక్షల 41వేల రూపాయలు కాగా మిగులు రూ 14 కోట్ల 79 లక్షల 86 వేల రూపాయలుగా ప్రతిపాదించారు. ఈ సమావేశంలో కార్పొరేటర్లు, కో ఆప్షన్ సభ్యులతోపాటు డిప్యూటీ కమిషనర్ త్రయంబకేశ్వర్ రావు, సెక్రెటరీ రాజు, అసిస్టెంట్ కమిషనర్ రాజలింగు, ఎస్ఇ చిన్న రావు, ఇఇ సుచరణ్, ఎగ్జామినర్ షేక్ మస్తాన్ ఖాజా, సూపరింటెండెంట్ మనోహర్, తదితరులు పాల్గొన్నారు.